RNI NO:TELTEL/2017/74161

www.janavijayam.com

# జన విజయం

# JANA VIJAYAM

## మీరు జర్నలిస్టుగా పని చేస్తారా?

రెండు తెలుగు రాష్ట్రాల నుండి జనవిజయం వారపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫర్, నియోజకవర్గం ఇన్‌చార్జ్, మండల రిపోర్టర్‌లు కావలెను.

సంఘటనను వార్తగా మలచే తెలుగు భాషా ప్రావీణ్యం ఉంటే చాలు.

18సం. పైన వయసు కలిగియుండి జర్నలిజం పట్ల ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

మీ వివరాలను పంపించాల్సిన చిరునామా:

వాట్సాప్ నెంబర్ : 9866925937

మెయిల్ ఐ.డి : janavijayam@gmail.com

ఖమ్మం | సంపుటి : 9 | సంచిక : 11 | 14 - 20 డిసెంబర్, 2025 | ఎడిటర్ : పల్లా కొండల రావు | పేజీలు : 8 | వెల : రూ. 15.00

KHAMMAM | Volume : 9 | Issue No : 11 | 14 - 20 December, 2025 | EDITOR : PALLA KONDALA RAO | PAGES : 8 | RS : 15.00



# హిట్ అండ్ రన్ కేసులో బెయిల్ నిరాకరణ...

## - ఇలాంటి వారికి గుణపాఠం నేర్పాల్సిందే - ముంబై కేసులో సుప్రీం తీవ్ర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, డిసెంబరు 13 : ముం బయిలో గతేడాది చోటుచేసుకున్న హిట్-అండ్- రన్ కేసు లో సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తనకు బెయిల్ ఇవ్వాల్సిందిగా కోరుతూ.. నిందితుడు మిహిర్ షా వేసిన పిటి షన్‌పై దర్యాప్తునకు నిరాకరించింది. ఇలాంటి అబ్బాయిలకు తగిన గుణ పాఠం నేర్పించాల్సిందేనని వ్యాఖ్యా నించింది. హిట్-అండ్-రన్ కేసులో బైక్‌పై వస్తోన్న వారిని అతివేగంగా తన కారుతో ఢీకొట్ట డమే కాకుండా నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడని జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఏజీ మాసిహ్‌లతో కూడిన ధర్మాస నం పేర్కొంది. చేసిన నేరానికి గానూ అతడు కొద్ది రోజుల పాటు జైల్లోనే ఉండా లని ఆదేశించింది. గతేడాది ముంబయి లోని వర్లీ ప్రాంతంలో శివసేన నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా మద్యం మత్తులో బీఎండబ్ల్యూ కారును వేగంగా నడుపుతూ ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టాడు. దీంతో స్కూటీపై ఉన్న దంప తులు ఎగిరిపడ్డారు. వేగంగా వెళ్తున్న కారు మహిళపై నుంచి దూసుకెళ్ల డంతో కావేరి నక్వా (45) అక్కడికక్కడే మర ణించగా.. ఆమె భర్త గాయపడ్డారు.




## ట్రంప్ దెబ్బకు హెచ్-1బి వీసాదారుల..

# విలవిల !

- వందలాదిగా వీసా అపాయింట్‌మెంట్ల రద్దు
- చిక్కుకుపోయిన భారతీయ కుటుంబాలు
- సోషల్ మీడియా ఖాతాల స్క్రూటినీ నిబంధనతో ఇబ్బందులు

న్యూఢిల్లీ,డిసెంబరు 13: అమెరికాకు రావాలనుకునేవారి సోషల్ మీడియా అకౌంట్‌లను సునిశితంగా పరిశీలించాల్సిందేనని ఇటీవల అమెరికా విదేశాంగ శాఖ కొత్తగాతీసుకువచ్చిన విధానంతో వందలాది భారతీయ హెచ్-1బి వీసాదా రులు, వారి కుటుంబాలు భారత్‌లో చిక్కుకుపోయా యి. ఈ పరిస్థితి మూకుమ్మడిగా వీసా నియామకాల రద్దుకు, రీషెడ్యూలిం గ్‌కు దారి తీసి ంది.దీనివల్ల అనేకమంది ఉద్యోగాలు ప్రతిష్టంభనలో పడ్డాయి,వారి కుటు ంబ జీవితాలకు అంతరాయం కలిగింది. హెచ్-1బి వీసాలపై వున్న వందలాదిమంది భారతీయులు వారితో పాటూ హెచ్-4 మీద ఆధారప డిన వారి భాగస్వాములు, వారిపిల్లలు అందరూ కూడా భారత్‌లోనే వుండిపోయారు. కొన్ని కేసుల్లో, కుటుంబాలు విడిపోయాయి. కొంతమంది కుటుంబ సభ్యులు అమెరికాలో వుంటే మరికొంతమంది కుటుంబ సభ్యులు భారత్‌లో వుంటున్నారు. వెంటనే వెనక్కి తిరిగి వెళ్ళాలనుకున్నా వెళ్ళలేని పరిస్థితి, అంతులేని జాప్యం కొనసాగుతోంది.

# ఉప్పల్ స్టేడియంలో..


# రేవంత్ రెడ్డి, మెస్సీ ఫ్రెండ్లీ మ్యాచ్

**గోల్ చేసిన రేవంత్ రెడ్డి... మెస్సీ రెండు గోల్స్**
**ఉప్పల్ స్టేడియంలో రేవంత్ రెడ్డి, మెస్సీ ఫ్రెండ్లీ మ్యాచ్**
**ఇరుజట్లతో ఫొటోలు దిగిన రేవంత్ రెడ్డి, మెస్సీ**
**స్టేడియంలో తిరుగుతూ అభివాదం**
**తెలుగువారిని కలవడం సంతోషంగా ఉంది: మెస్సీ**




హైదరాబాద్, డిసెంబరు 13 : హైదరాబాద్ నగరానికి వచ్చి తెలుగు ప్రజలను కలవడం చాలా సంతోషంగా ఉందని ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు లియోనల్ మెస్సీ అన్నాడు. తెలుగు ప్రజలు చూపిన అభిమానం తనకు ఎంతో శక్తిని ఇచ్చిందని పేర్కొన్నాడు. మెస్సీ హైదరాబా ద్ పర్యటన సందర్భంగా ఉప్పల్ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఫ్రెండ్లీ మ్యాచ్ జరిగింది. మెస్సీ అపర్ణ మెస్సీ జట్టు తరపున, రేవంత్ రెడ్డి సింగరేణి ఆర్ఆర్ జట్టు తరపున ఆడారు. ఈ మ్యాచ్‌లో సింగరేణి ఆర్ఆర్ జట్టు 4-2 గోల్స్ తేడాతో అపర్ణ మెస్సీ జట్టుపై విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం సింగరేణి ఆర్ఆర్ జట్టుకు మెస్సీ ట్రోఫీని అందించగా, అపర్ణ మెస్సీ జట్టుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహు మతి ప్రదానం చేశారు. కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు మెస్సీపేరుతో ఉ న్నజెర్సీని లియోనల్ మెస్సీ అందజేశారు.గోట్ కప్ పేరుతో ఈ ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌జరిగింది. ఈ సందర్భంగా మెస్సీ, రేవంత్ రెడ్డి ఫ్రెండ్లీ మ్యాచ్ ఆడారు. సింగరేణి ఆర్ఆర్ జట్టు తరపున రేవంత్ రెడ్డి, అపర్ణ జట్టు తరపున లియోనల్ మెస్సీ ఆడారు.



## కాలుష్య కోరల్లో ఢిల్లీ..

# పడిపోయిన దృశ్యమానత

### ఢిల్లీ ఎయిర్‌పోర్టు కీలక అడ్వైజరీ

ఢిల్లీ, డిసెంబరు 13 : దేశ రాజధాని ఢిల్లీ కాలుష్య కోరల్లో అల్లాడుతోం ది. గతకొన్ని రోజులుగా రాజధాని నగరంలో కాలుష్యం ప్రమా దకరస్థాయిలో కొనసాగుతో ంది. శనివారం కూడా ఎయిర్ క్వాలిటీఇండెక్స్‌తీవ్రస్థా యిలో నమోదైంది.సెంట్ర ల్ పొల్యూ షన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. శనివారం ఉదయం ఢిల్లీ-ఎన్సీఆర్‌ప్రా ంతంలోని 18 మానిటరింగ్ స్టేషన్లలో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైగానే నమోదయ్యా యి. మరోవైపు నగరాన్ని దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో దృశ్యమానత పడిపో యింది. కొన్ని మీటర్ల దూర ంలో వెళ్తున్న వాహనాలు కూడా కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఈ పొగమంచు విమాన, రైలు రాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

## తిరువనంతపురంలో బీజేపీ చారిత్రాత్మక

# విజయం

### స్పందించిన మోదీ, శశిథరూర్

- క్షేత్రస్థాయిలో కార్యకర్తల కృషి వల్లే బీజేపీ గెలిచిందన్న మోదీ
- కేరళ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ప్రజలు విశ్వసించారని వ్యాఖ్య
- నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తికి ఈ ఎన్నికలు నిదర్శనమన్న శశిథరూర్



ఢిల్లీ, డిసెంబరు 13 : తిరువనంతపురం కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంతోషం వ్యక్తం చేశారు. ఇది కేరళ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన మలుపు అని ఆయన అభివరి?ంచారు. దాదాపు నాలుగున్నర దశాబ్దాలుగా అధికారంలో ఉ న్న ఎల్డీఎఫ్‌ను ఓడించడానికి క్షేత్రస్థాయిలో తమ కార్యకర్తలు చేసిన కృషి కారణమని ఆయన పేర్కొన్నారు. తిరువనంతపురంలో గెలుపు కోసం కృషి చేసిన బీజేపీ కార్యకర్తల ను ఆయన అభినందించారు. కేరళ అభివ ృద్ధి బీజేపీతోనే సాధ్యమని, ఇదే విషయాన్ని తిరువనంతపురం ప్రజలు విశ్వసిం చారని అన్నారు. తిరువనంతపురం అభివద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు బీజేపీ కృషి చేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. తిరువనం తపురం కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన బీజేపీ నేతలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు, ఎంపీ శశిథరూర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఫలితాలు నిజమైన ప్రజా స్వామ్య స్ఫూర్తికి నిదర్శనమని అన్నారు. 45 ఏళ్లుగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ చేస్తు న్న అక్రమాలను తాను చాలాసార్లు ప్రశ్నిం చానని, వారి పాలన నుంచి ప్రజలు బయ టపడాలని కోరుకున్నారని అన్నారు.



## ఇది విజన్ 2047 కాదు

# పాయిజన్ 2047

### - మాజీ మంత్రి హరీశ్ రావు

హైదరాబాద్, డిసెంబర్ 13: మెస్సితో ఫుట్ బాల్ ఆడేందుకు కోట్లు ఖర్చు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాస్టల్ పిల్లలకు మాత్రం తిండి పెట్ట డంలేదని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలన యాడ్స్‌లో తెలంగాణ రైసింగ్ హాస్పి టల్స్‌లో విద్యార్థులు ఫాలింగ్ అన్నట్ల గా ఉందని ఎద్దేవా చేశారు.

రేవంత్ రెడ్డివిజన్ 2047అని డబ్బాకొట్టు కుం టున్నాడు. ఇది విజన్ 2047 కాదు.. విద్యార్థుల పాలిట పాయిజన్ 2047 గా మారిందని దుయ్యబట్టారు. రా హుల్ గాంధీ కి ఫుట్ బాల్ మ్యాచ్ మీద ఉన్న శ్రద్ధ చనిపోతున్న రైతులు, విద్యార్థుల మీద లేదన్నారు. బాగ్ లింగంపల్లి మైనార్టీ గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై కింగ్ కోఠి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఇవాళ హరీష్ రావు పరా మర్శించారు.

విద్యా ర్థులకు అందు తున్న వైద్యం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడి యాతో మాట్లాడిన హరీష్ రావు రేవం త్ రెడ్డి ప్రభుత్వం పై, రాహుల్ గాంధీ పర్యటనపై తీవ్ర స్థాయిలో మం డిపడ్డారు. రాష్ట్రంలో ప్రతి రోజూ ఏదో ఒక గురుకుల పాఠ శాలలో ప్రభుత్వ పాఠశాల లో విద్యార్థులు కలుషిత ఆహారం తిని ఆసు పత్రి పాలవుతు న్నారని మొన్న షామీ ర్‌పేట్‌లో బీసీ గురుకుల పాఠశా లలో అన్నంలో పురుగులు వస్తున్నా యని విద్యార్థులు ఏకంగా పోలీస్ స్టేషన్‌కి వెళ్లే పరిస్థితి వచ్చిందన్నారు.



## ఈవెంట్ మేనేజర్‌లా

# రేవంత్ వ్యవహారం

- సమస్యలు పక్కన పెట్టి మెస్సీతో ఆటలా?
- కవిత ఆరోపణలపై విచారణ జరిపించాలి
- బండి పిఆర్‌వో పోస్టుపై ఈటెల ఆగ్రహం

హనుమకొండ, డిసెంబరు13 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈవెంట్ మేనేజర్ లా వ్యవహరిస్తున్నారని భాజపా ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. ప్రజా సమస్యలు పక్కన పెట్టి మెస్సితో ఫుట్‌బాల్ ఆడుతున్నారని మండిపడ్డారు. సింగరేణిలో క్వార్టర్లు బాగు చేయడానికి, సిబ్బందికి జీతాలు ఇవ్వడానికి డబ్బులు లేవు. కానీ సింగరేణి డబ్బులు రూ.100 కోట్లు పెట్టి ఫుట్‌బాల్ మ్యాచ్ ఆడుతు న్నారు. పేదల ఇళ్లను కూలుస్తున్న హైడ్రా.. పెద్దల కబ్జాను పట్టించుకోవడం లేదు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత చేసిన ఆరోపణ లపై ప్రభుత్వం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.




## ట్రంప్ దెబ్బకు హెచ్-1బి వీసాదారుల విలవిల!

న్యూఢిల్లీ : అమెరికాకు రావాలనుకునేవారి సోషల్ మీడియా అకౌంట్‌లను సునిశితంగా పరిశీలించాల్సిం దేనని ఇటీవల అమెరికా విదేశాంగ శాఖ కొత్తగా తీసుకు వచ్చిన విధానంతో వందలాది భారతీయ హెచ్-1బి వీసాదారులు, వారి కుటుంబాలు భారత్‌లో చిక్కుకుపో యాయి. ఈ పరిస్థితి మూకుమ్మడిగా వీసా నియామకాల రద్దుకు, రీ షెడ్యూలింగ్‌కు దారి తీసింది.



# కార్పొరేట్ల గుప్పెట్లో పచ్చని భూములు

**- కర్నూలు జిల్లాలో ఇప్పటికే 20 వేల ఎకరాలు వారి చేతుల్లో**

**- మరో 15 వేల ఎకరాలు కట్టబెట్టేందుకు ప్రభుత్వం సన్నాహాలు**

**కర్నూలు,,డిసెంబర్,13 :** అభివృద్ధి, ఉద్యోగాలు, ఉపాధి పేరుతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పచ్చని పంట పొలాలను కార్పొరేట్ల కట్టబెడు తున్నాయి. కర్నూలు జిల్లాలో 2015 నుంచి ఇప్పటికే 20 వేల ఎకరాలు వారి గుప్పిట్లోకి వెళ్లిపోయాయి. మరో 15 వేల ఎకరాలను కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. 2015లో గడివేముల మండలం ఘని, శకునాల గ్రామాల పరిధిలో కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్ పేరుతో ఆరు వేల ఎకరాలను ప్రభుత్వం కేటాయించిం ది. ఈ ప్రాజెక్టును ఒక గిగావాట్స్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రారంభించా రు. అయినా, స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వలేదు. డి-పట్టా భూము లనే పేరుతో రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండానే భూములు తీసుకో వాలని ప్రయత్నించింది. దీనికి వ్యతిరేకంగా సిపిఎం, రైతు సంఘాల పోరాటం ఫలితంగా అప్పటి టిడిపి ప్రభుత్వం చివరికి 1,800 మంది రైతులకు ఎకరాకు రూ.4.20 లక్షల చొప్పున పరిహారం అందించింది. ఓర్వకల్లులోని జయరాజ్ ఇస్పాత్ స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ ప్లాంట్ వల్ల ప్రత్యేక్షంగా 1,100 మందికి, పరోక్షంగా ఆరు వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. రెండు వేల ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. ఆ ప్లాంట్‌ను నేడు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రారంభించనున్నా రు. ఇప్పటి వరకు సుమారు 3,200 మందికి ఉపాధి కల్పించినట్టు చెబుతున్నారు. అదే మండలంలోని నన్నూరు గ్రామ పంచాయతీ పరిధిలో డ్రోన్ హబ్ కోసం సుమారు 300 ఎకరాలను ప్రభుత్వం బలవంతంగా లాక్కొంది. దీని నిర్మాణ పనులకు ప్రధాని మోడీ ఈ నేడు శంకుస్థాపన చేయనున్నారు. 2018లో ఓర్వకల్లు మండలం గుమ్మితం తండా, పాణ్యం మండలం పిన్నాపురం ప్రాంతాల్లో గ్రీన్‌కో పేరుతో ఇంటిగ్రేటెడ్ పవర్ ప్రాజెక్టుకు ప్రభుత్వం 4,500 ఎకరాలను కట్టబెట్టింది. రైతులు సాగు చేసుకుంటున్న రెండు వేల ఎకరాల్లో పట్టాలు ఉన్న వంద మంది రైతులకు చెందిన 500 ఎకరాలకు మాత్రమే ఎకరాకు రూ.8 లక్షల నుంచి రూ.11 లక్షల వరకూ పరిహారాన్ని అందించారు. ఏళ్ల కాలంగా మరో 300 మంది రైతులు 1500 ఎకరాలు సాగు చేసుకుంటున్నా పరిహారం ఇవ్వలేదు. 2022 సెప్టెంబర్‌లో నంద్యాల జిల్లా కొలిమిగుండ్లలో రామ్‌కో పరిశ్రమను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రారంభించినప్పుడు దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఆ సంఖ్యలో ఉద్యోగులు ఉన్నా, వారిలో స్థానికులు 300 మందే. కర్నూలు అల్ట్రా మెగా సోలార్ పార్క్‌కు భూములు ఇచ్చిన రైతుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. మొత్తం 1800 రైతు కుటుంబాలు ఉ ండగా, 25 మంది ఐటిఐ వారికి, పది మంది డ్రైవర్లకు మాత్రమే అందులో ఉద్యోగాలు కల్పించారు. తాజాగా పత్తికొండ మండలం హొసూరు, పెద్దహుల్తి గ్రామాల్లో సోలార్ విద్యుదుత్పత్తి కోసం టాటా పవర్ కంపెనీ రైతుల నుంచి 1800 ఎకరాలను సేకరిస్తోంది. ఆ ప్రాంతంలో రైతులు వేరుశనగ, ఉల్లి, వాము, జొన్న, కొత్తిమీర తదితర పంటలను సాగు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. మధ్య దళారులు రైతులను మభ్యపెట్టి పంట భూముల ను కారు చౌకగా ప్రయివేట్ కంపెనీలకు దోచిపెడుతున్నారు. ఇప్పటికే రైతుల నుండి దాదాపు వెయ్యి ఎకరాలకు లీజు ఒప్పందం జరిగినట్లు సమాచారం. ఆలూరు, హొళగుంద, ఆస్పరి,

చిప్పగిరి మండలాల్లో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు సాయిరాం, పెంటాగాన్, దత్తు, టిజివి గ్రూప్ కంపెనీలు కలిసి ఐదు వేల ఎకరాలను రైతుల నుంచి సేకరిస్తున్నాయి. వాటికి తోడు ఓర్వకల్లు మండలం మీదివేముల, కొమరోలు, పాలకొలను, గుట్టపాడు, పూడిచర్ల గ్రామాల్లో 15 వేల ఎకరాలను రైతుల నుంచి లాక్కొని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ఎపిఐఐసి సిద్ధం అవుతోంది.

ఆలూరులో రైతుల నుంచి వ్యతిరేకత: ఆలూరు నియోజకవర్గంలో మనేకుర్తి, హులేబీడు, కమ్మరచేడు గ్రామాల రెవెన్యూ పరిధిలో సోలార్ కోసం 192 ఎకరాల సాగు భూమిని రాష్ట్ర ప్రభుత్వం చేసేందుకు సమాయత్తం అవుతోంది. మనేకుర్తికి చెందిన రైతుల నుండి 94.64 ఎకరాలు, హులేబీడు గ్రామానికి చెందిన 82.11 ఎకరాలు, కమ్మరచేడు గ్రామానికి చెందిన 15.016 ఎకరాలు భూసేకరించాలని నిర్ణయించింది. 60 మంది రైతులు భూములు ఇవ్వబోమని తేల్చి చెబుతున్నారు. ఆలూరు మండలం మనేకుర్తిలో సోలార్ గ్రిడ్ కోసం సేకరించే భూమికి తొలుత ఎకరాకు రూ.6 లక్షల పరిహారం ఇస్తామన్నారు. తర్వాత దాన్ని రూ.12 లక్షలకు పెంచారు. తాజాగా రూ.18లక్షలు ఇస్తామనిఅంటున్నారు. అయినా, సరే మా భూములు ఇస్తే తమకు ఆధారం లేకుండా పోతుందని, భూములను ఇచ్చేదే లేదని రైతులు తేల్చి చెబుతున్నారు.

# రోడ్లు బాగుపడేదప్పుడు?


**నిజామాబాద్,డిసెంబర్,13 :** మండలంలోని రహదారులు గుంతల మాయంగా మారడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదర ప్రధాన రహదారితోపాటు మద్దిమడుగు వరకు ఎక్కడ పడితే అక్కడ గుంతలు పడి యమ లోకానికి ద్వారాలుగా ఉన్నాయి.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా రహదారుల మరమ్మత్తు పనులపై పట్టించుకోలేకపోవడం దురదృష్టకరం.. నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మండల పర్యటనకు వచ్చినప్పుడల్లా ఈ రహదారుల గుండానే ప్రయాణం చేస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం గమనార్హం. కోతులు పడిన ఈ రహదారిలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు గోతుల్లో పడి తీవ్రంగా గాయపడిన సంఘటనలు అనేకం. వర్షపు నీరు నిలిచి ఉండడంతో గోతులు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్న పరిస్థితి.గత ప్రభుత్వ మాజీ ఎమ్మెల్యే ఎన్నోసార్లు హామీలు ఇచ్చి ఏ రోడ్డు కూడా మరమ్మతులు చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. పదర నుండి మద్దిమడుగు వరకు డబల్ రోడ్డు వేయాలని ప్రయాణికులు, గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.కొంతకాలంగా గ్రామీణ ప్రాంతాల్లోని రహదారులు బిటిగా మార్చకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిగా మట్టి రోడ్లు కావడం అధిక వర్షాలు కురుస్తుండడంతో దారులన్నీ దెబ్బతిని రాకపోకలకు వీల్లేని విధంగా మారాయి. అదే మార్గాల్లో భారీ వాహనాలు సైతం వెళ్తుండడంతో నిత్యం వ్యవసాయ పొలాలకు వెళ్లే రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు.అధిక మంది పాడి రైతులు ఉదయం సాయంత్రం రాకపోకలు చేస్తుండడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు నియోజకవర్గ సరిహద్దు గ్రామాల పరిస్థితి అధ్వానంగా మారింది. నియోజకవర్గ ఎమ్మెల్యే స్పందించకపోవడంతో ఎన్నో ఏళ్లుగా మట్టి దారిలో దర్శనమిస్తున్నాయి. నిత్యం గతుకుల రోడ్డులోని వాహనదారులు రాకపోకలు చేస్తున్నారు. అధికారులు ప్రజా ప్రతి నిధులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లోని మట్టి దారులను బీటీ దారుల మార్చాలని ప్రజలు కోరుతున్నారు.

# 22 ఏ కిందకు ఎకరాల భూమి

## అమ్మకోలేరు..వాడుకోలేరు

**ఏలూరు,డిసెంబర్,13 :** కొందరికీ ఎకరాల కొద్దీ భూమి ఉంది. కానీ ఏదైనా అత్యవసం అయితేనో.. ఆడబిడ్డకో ఇవ్వలేరు.. వారసులకు పంచలేరు. చుట్టూ నీరున్నా.. తాగడానికి పనికి రాదు అన్న చందంగా ఉంది వారి పరిస్థితి. ఎకరాల కొద్దీ భూములున్నా అవన్నీ 22ఎ(నిషేధిత ఆస్తుల) జాబితాలో ఉండటంతో.. ఇటు అమ్ముకోలేక.. అటు వారసుల కు పంచలేక భూ యజమానులు నరకం చూస్తున్నారు. అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధుల భూములు చేతులు మారినా.. గత ప్రభుత్వం ఫ్రీహోల్డ్‌లో పెట్టి అమ్మకాలు ఆపేసింది. సుమారు 15 వేల ఎకరాల భూములు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయి. భూమి ఉంటే మనిషికి కొండంత భరోసా. ఎంత పెద్ద కష్టం వచ్చినా సరే.. తీర్చుకోవచ్చు అనే ధీమా ఉ ంటుంది. చిన్న చిన్న అక్కర్లకు అయితే భూమిని తాకట్టు పెట్టి రుణం పొందవచ్చు. పెద్ద సమస్య వస్తే.. భూమిని అమ్ముకుని కష్టం నుంచి బయపడవచ్చు. ఆడబిడ్డ పెళ్లికి కట్నంగా కూడా ఇవ్వొచ్చు. భూమి ఉంటే మనిషికి తల్లి దగ్గర ఉన్నంత భరోసా ఉంటుంది. కానీ ఇప్పుడు మనం చెప్పుకోబోయే రైతులది విచిత్రమైన పరిస్థితి. వారందరి పేరు మీద వేల ఎకరాల భూములున్నా.. వారికి అక్కరకు రాకుండా పోతున్నాయి. పోని వారసులకు పంచుదామా అంటే దానికి వీలు లేకుండా ఉంది. అసలేంటి సమస్య అంటే..పశ్చిమ గోదావరి జిల్లాలోని చాలా మంది రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. వారి పేరు మీద ఎకరాల కొద్దీ భూములున్నా.. ఇటు ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక.. అటు వారసులకు పంచలేని దుస్థితిలో ఉన్నారు. కారణం వారి భూములు 22ఎ జాబితాలో ఉండటం. అదేలా జరిగింది అంటే.. ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్స్ ఈ జాబితాలోకి వస్తాయి. ఈ భూములను అమ్ముకోలేరు.. వారసులకు పంచలేరు.మండలంలో అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. గతంలో పేదలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, స్వాతంత్ర్య సమరయోధులు, సైనికులకు కేటాయించిన భూములను కొందరు అమ్ముకున్నారు. ఈ భూములు పలుమార్లు చేతులు మారాయి. అయితే గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ భూములను ఫ్రీహోల్డ్‌లో పెట్టింది. వాటి అమ్మకాలు, కొనుగోళ్లను నిలిపివేసింది. ఈ భూములకు సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు, అడంగల్ పత్రాలు, పాస్‌పుస్తకాలు వంటివి ఉ న్నా సరే.. పాలకుల నిర్ణయాల వల్ల సంవత్సరాల తరబడి ఇబ్బంది పడుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అయినా తమ సమస్యను పరిష్కరిస్తుందని వారు ఆశించారు. కానీ రోజులు గడుస్తున్నా సమస్య పరిష్కారం కాలేదు. ఈక్రమంలో తాజాగా పెదవేగి మండలానికి చెందిన కొందరు.. కోర్టు అనుమతితో భూములను రిజిస్టర్ చేయించుకున్నారు. అయితే ఈ సమస్య ఎదుర్కొంటున్న అందరూ ఇలా కోర్టుకు వెళ్లడం సాధ్యం కాదు. కనుక ప్రభుత్వమే ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.పెదవేగి మండలంలోనే అత్యధికంగా 15 వేల ఎకరాల భూమి ఈ సమస్యను ఎదుర్కొంటుం ది. ఈ భూముల సమస్యలను పరిష్కరించాలని బాధితులు పీజీఆర్ ఎస్‌లోనూ విన్నవించుకున్నారు. అయినా ప్రయోజనం లేదని తెలు స్తోంది. ఈ భూములపై ప్రతి వారం కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్షలు జరుగుతున్నాయని అధికారులు తెలిపారు. సరైన పత్రాలు ఉన్న భూములను ఈ జాబితా నుంచి తొలగిస్తామని వెల్లడించారు. వాటి క్రయ, విక్రయాలకు అవకాశం కల్పిస్తున్నామని.. ఈ మేరకు తహసీల్దార్లకు ఆదేశాలు ఇచ్చామని వారు పేర్కొన్నారు

# ఆక్రమణలు తొలగించిన హైడ్రా



**రాజేంద్రనగర్,డిసెంబర్,13 :** సర్కిల్ పరిధిలోని బద్వేల్, ఉప్పర్ పల్లి గ్రామాల్లోని జనచైతన్య లేఔట్ ఫేజ్ 1, 2లలో ఆక్రమణలకు గురైన 4 పార్కు స్థలాలకు హైడ్రా విముక్తి కల్పించింది. 19878 గజాల భూమిని ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకుంది. దీని విలువ రూ.139 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. దాదాపు 120 ఎకరాల్లో ఫేజ్ పేరుతో హుడా అప్రూవల్ తో ఏర్పాటు చేసిన జనచైతన్య లేఔట్ లో పార్కులు కబ్జాకు గురి అవుతున్నాయని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యా దులు అందాయి. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం కబ్జాలు జరిగినట్టు హైడ్రా నిర్ధారించింది. ఈ మేరకు కబ్జాలను తొలగించింది. ప్రహరీలు నిర్మించు కొని వేసిన షెడ్డులను , రూమ్ లను హైడ్రా తొలగించింది.


# నిరుపేద మహిళకు చేయూత..

**కమ్మర్ పల్లి,డిసెంబర్,13 :** మండల కేంద్రానికి చెందిన నిరుపేద మహిళ సంపంగి మాధురికి లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ అందజేసినట్లు లైన్స్ క్లబ్ అధ్యక్షుడు లుక్క గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాధురి భర్త బాలరాజ్ మరణిం చడంతో ఇద్దరు పిల్లలను పోషిస్తూ కుటుంబ భారాన్ని మోస్తుందని తెలిపారు. స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా ఇలాంటి మహిళలకు ఇస్తే స్వయం ఉపాధి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించడంలో ఆర్థికంగా చేదోడు వాదోడుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమ ంలో లైన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి గంగాధర్, కోశాధికారి తెడ్డు రమేష్, ఉపాధ్యక్షుడు సున్నం మోహన్, కార్యవర్గ సభ్యులు నోముల నరేందర్, చింత ప్రదీప్, సుంకరి విజయ్, తదితరులు పాల్గొన్నారు.




# 2061 నాటి ఒత్తిడికి తగ్గట్టుగా రెడీ అవుతున్న బెజవాడ రైల్వేస్టేషన్

**విజయవాడ,డిసెంబర్,13 :** విజయవాడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. ఇక మీదట ఈ స్టేషన్‌లో విమానాశ్రయం తరహా సౌకర్యా లు అందు బాటులోకి రానున్నాయి. రానున్న 30 ఏళ్ల ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా స్టేషన్ని అభివృద్ధి చేయబోతున్నారు. నీతి ఆయోగ్ ఈ రైల్వే స్టేషన్ ఆధునికీకరణకు ఆమోదం తెలిపింది. పీపీపీ పద్ధతిలో చేపట్టే ఈ ప్రాజెక్టుతో స్టేషన్ రూపురేఖలే మారిపోను న్నాయి. స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్య పెరగడమే కాక.. లిఫ్టులు, ఎస్కెలెటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించబోతున్నారు. భారత్ స్టేషన్ పథకంలో భాగంగా.. కేంద్ర ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా ఉన్న ప్రధానమైన రైల్వే స్టేషన్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోం ది. దీనిలో భాగంగా విజయవాడ రైల్వే స్టేషన్ రూపు రేఖలు మార్చేందుకు సిద్ధమయ్యింది. వందల కోట్లరూపాయల నిధులు వెచ్చించి స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. రానున్న 30 ఏళ్ల పాటు ప్రయాణికులు అవసరాలు తీర్చేలా స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. పీపీపీ విధానంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈక్రమంలో రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల సంఖ్య పెంచనున్నారు. ఆ వివరాలు..కేంద్రం ప్రభుత్వం చొరవతో.. విజయవాడ రైల్వేస్టేషన్‌ను విమానాశ్రయానికి ధీటుగా అభివృద్ధి చేయనున్నారు. వచ్చే 30 ఏళ్లలో ప్రయాణికుల అవసరాలకు తగ్గట్టుగా స్టేషన్‌ను ఆధునికీకరించనున్నా రు. ఈ అభివృద్ధి పనులకు తాజాగా నీతి ఆయోగ్ ఆమోదం తెలిపింది. ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) పద్ధతిలో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈమేరకు రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఈ పనుల టెండర్లకు సంబంధించి తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. డిసెంబర్ 31 లోపు టెండర్లు దాఖలు చేయాలని తెలిపింది.ప్రస్తుతం విజయవాడ రైల్వే స్టేషన్‌లో రోజుకు లక్ష నుంచి 2 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే మరో 30 ఏళ్లలో అనగా 2061 నాటికి ప్రయాణికుల సంఖ్య 4-5 లక్షలకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు.



ఇందుకు తగ్గట్టుగా స్టేషన్‌ను తీర్చిదిద్దనున్నారు.ప్రస్తుతం రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వైపు మాత్రమే అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. త్వరలోనే పశ్చిమ వైపు కూడా రైల్వే స్టేషన్‌ను విస్తరించనున్నారు. అభివృద్ధి పనుల్లో భాగంగా వన్‌టౌన్ వైపు 2, 3 అదనపు ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. దీంతో పాటు.. ప్రస్తుతం ఆర్‌ఈ కాలనీలో ఉన్న రైల్వే క్వార్టర్స్‌ను తొలగించి.. ఆ స్థలాన్ని కూడా అభివృద్ధికి వాడుకోనున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా.. ఇక్కడ విమానాశ్రయంతో సమానమైన సౌకర్యాలు కల్పించనున్నారు.విజయవాడ స్టేషన్ 84 వేల చదరపు మీటర్లలో ఉంటుంది. ఆధునీకికరణలో భాగంగా రైల్లే స్టేషన్లో కొత్తగా 2, 3 ప్లాట్‌పారాలు రానున్నాయి. లిఫ్ట్‌ల సంఖ్య 20కి పెరగనుండగా.. ఎస్కెలెటర్ల సంఖ్య 15కు పెరగనుంది. 3 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ఇందుకు గాను సుమారు రూ.661.11 కోట్లు ఖర్చు అవుతుందని భావిస్తున్నారు.ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఈ ఆధునికీకరణ ముఖ్య ఉద్దేశ్యం అంటున్నారు అధితకారులు. స్టేషన్‌ను మరింత విశాలంగా, ఆధునికంగా మార్చడం ద్వారా ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచాలని రైల్వే అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మార్పులతో విజయవాడ రైల్వేస్టేషన్ ఒక ప్రధాన రవాణా కేంద్రంగా రూపుదిద్దుకోనుంది.

# ముంచుకొస్తున్న మరో మహమ్మారి!

టోక్యో, : కరోనా మహమ్మారి తర్వాత ప్రపంచవ్యాప్తంగా ఒక పెద్ద సంక్షోభం పొంచి ఉంది. జపాన్ ఇన్ఫ్లుఎంజా మహమ్మారిని ప్రకటించింది. వాస్తవానికి ఆ దేశంలో ఫ్లూ కేసుల సంఖ్య అకస్మాత్తుగా పెరిగింది. అందువల్ల ఈ వ్యాధిని ఎదుర్కోవడానికి మొదటి నుండి చర్యలు ప్రకటిం చారు. జపాన్‌లో 4,000 మందికి పైగా ఆసుపత్రి పాలయ్యారు. చాలా చోట్ల పాఠశాలలు మూసివేశారు. జపాన్‌లో ఫ్లూ రోగులు కొత్త కాదు, కానీ ఈసంవత్సరం వారు పెరిగే సీజన్ కంటే చాలా ముందుగానే సమస్య తలెత్తింది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. వ్యాప్తి సాధారణం కంటే ఐదు వారాల ముందుగానే వచ్చింది, ఇదిఆసియా అంతటా వైరస్

వ్యాప్తి నమూనాలో మార్పును సూచిస్తుంది.ముందు జాగ్రత్త చర్యగా వీలైనంత త్వరగా టీకాలు వేయించుకోవాలని ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ పౌరులను కోరింది. ఈ కేసుల ప్రారంభ పెరుగుదల ఆసుపత్రి వ్యవస్థలపై ఒత్తిడిని కలిగిస్తుందని వైద్యులు హెచ్చరించారు. దీనిని కాలానుగుణ ఫ్లూ వ్యాప్తి అని పిలుస్తున్నప్పటికీ, దాని తీవ్రత, సమయం భారతదేశంతో సహా ఇతర దేశాలకు హెచ్చరిక గంటలు లేవనెత్తాయి. ఎందుకంటే శీతాకాలం సమీపిస్తోంది, శ్వాసకోశ సమస్యలు పెరుగుతున్నాయి. అధికారుల ప్రకారం జపాన్‌లోని 47 ప్రిఫెక్చర్లలో 28 చోట్ల కేసుల సంఖ్య పెరిగింది. ముఖ్యంగా టోక్యో, ఒకినావా, కగోషిమాలో మరిన్ని కేసులు కనుగొన్నారు. అక్కడ 130కి పైగా పాఠశాలలు, పిల్లల సంరక్షణ కేంద్రాలు తాత్కాలికంగా మూసివేశారు. వైద్యుల ప్రకారం ఈ సంవత్సరం వ్యాప్తి అనేక కారణాల వల్ల మరింత తీవ్రంగా మారింది. ఇందులో ఫ్లూ వైరస్ విభిన్న జాతి కూడా ఉంది, ఇది మునుపటి కంటే శక్తివంతమైనదని చెబుతారు. అలాగే కోవిడ్-19 మహమ్మారి సమయంలో సంవత్సరాల తరబడి తక్కువ సంపర్కం కారణంగా రోగనిరోధక శక్తిలో హెచ్చుతగ్గులు కూడా కేసుల సంఖ్య పెరగడానికి ఒక కారణం. అదనంగా క్రమరహిత వాతావరణం కూడా వైరస్ వ్యాప్తిని పెంచుతోంది. వైద్యులు కూడా దీనికి కారణం

ఫ్లూకు వ్యతిరేకంగా టీకాలు వేయడం తగ్గడమేనని ఆపాదించారు. మహమ్మారి తర్వాత చాలా మంది నిర్లక్ష్యంగా మారారు, వార్షిక ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవడానికి సమయం తీసుకోరు, దీనివల్ల వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. నిపుణుల అభిప్రాయం ప్రకారం..

ప్రస్తుతానికి ఇది జరిగే అవకాశం లేదు. ఎందుకంటే ఇది సీజనల్ ఇన్ఫ్లుఎంజా మహమ్మారి ఇది ప్రధానంగా ఊ3ఔ2 అనే జాతి వల్ల వస్తుంది

## అధికారంలో ఉన్నప్పుడు బిఆర్ఎస్ పార్టీ చేసిన తప్పులే ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి.. విజయ రమణారావు,ప్రణవ్



**హుజురాబాద్ ,డిసెంబర్,13 :**కరీంనగర్ పట్టణంలోని ఆర్.అండ్.బీ గెస్ట్ హౌస్ లో పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు,హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ మీడియా సమావేశాన్నీ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హరీష్ రావు మాట్లాడేవాన్ని అబద్ధాలే అని,అబద్ధాల పునాదుల మీద బీఆర్ఎస్ పార్టీ పుట్టిందని,నీటి పారుదల శాఖ మంత్రిగా పని చేసిన హరీష్ రావు కి కూలడానికి,కుంగిపోవడానికి తేడా తెలుస్తలేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.చెక్ డ్యాం కు అణువుకాని ప్రదేశాల్లో నిర్మించి వాటిని డబ్బుల కోసం కమీషన్ ల కోసం రైతులను ఇబ్బంది పెట్టారని అన్నారు.ఇదే బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు కాళేశ్వరం కుంగిపోతే కనీసం చూడ్డానికి కూడా పోనివ్వలేదని ఇప్పుడు స్వేచ్ఛగా కూలిన ప్రదేశానికి వెళ్లగలుగుతున్నారని అన్నారు.కాళేశ్వరం కూలిన తరువాత ఎందుకు మరమ్మతు పనులు కొనసాగించలేదని,మీ తప్పిదాలు ఎదుట వారి మీద రుద్దడం సహజమయ్యిందని అన్నారు.జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల గుంపుల చెక్ డ్యాం ఇప్పుడే ఏం కూలలేదని గతంలో కూడా కూలిందనీ,వాటి మరమ్మతుల కోసం తక్షణం నిధులు కేటాయిస్తున్నామని అన్నారు.ఆనాడు బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు నేరేళ్ల ఘటనలో 3వ డిగ్రీ ప్రయోగించి,3,4 నెలలు జైల్లో ఉంచారని అన్నారు.వారి హయంలో ఏ రోజు నాణ్యతతో పని చేయలేదని,అప్పటి ఇసుక క్వారీల్లో సంతోష్ రావు కి వాటా లేదా అని ప్రశ్నించారు.జూబ్లిహిల్స్ ఎన్నికల్లో విషపు ప్రచారం చేసిన అక్కడి ప్రజలు సోషల్ మీడియాలో గెలిచారు కానీ బీఆర్ఎస్ పార్టీ ప్రజల మనసులను గెలవలేకపోయారని అన్నారు.



# హక్కులను హరించే కార్మిక కోడ్‌లు

కార్మికులకు తీపికబురు' అంటూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 22వ తేదీ నుంచి అమల్లోకి తెచ్చిన 4 కార్మిక కోడ్‌ల లోగుట్టు అంతా శ్రామిక వ్యతిరేకతనే నిండి ఉన్నది. కాలం చెల్లిన పాత చట్టాలు మారుతున్న పారిశ్రామిక విధానాలకు, కొత్తతరహా ఉద్యోగులకు వర్తించేలా లేవని చెప్తూ కేంద్రం వీటిని ప్రవేశపెట్టింది. అయితే, ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులు, ప్రయోజనాలను తొలగించి ఈ కోడ్‌లను పూర్తిగా కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా రూపొందించడం జరిగింది. పారిశ్రామిక వర్గాలు సంతోషంగా స్వాగతిస్తుండగా కార్మిక సంఘాలు వ్యతిరేకించడంలోనే వీటి అసలు రంగు బయటపడుతున్నది. మన దేశంలో కార్మిక అంశం కేంద్ర, రాష్ట్ర ఉమ్మడి జాబితాకు చెందినది. స్థానిక అవసరాలు, శ్రామిక ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాలు సొంత కార్మిక చట్టాలు రూపొందించుకుంటాయి. ప్రభుత్వం, కార్మికసంఘాలు, యాజమాన్యం కలిసి చర్చించి త్రైపాక్షిక ఒప్పందం ద్వారానే చట్టం ఆకారాన్ని పొందుతుంది.

దేశంలో కార్మికుల ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం 1942లో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను ఏర్పాటుచేసింది. లేబర్ పార్లమెంట్ ఆఫ్ ఇండియాగా పిలువబడే ఐఎల్‌సీ ప్రమేయాన్ని కూడా ఈ విషయంలో కేంద్రం ఖాతరు చేయలేదు. జూలైలో ఏర్పాటుచేసిన ఐఎల్‌సీ సమావేశంలో ప్రధాన కార్మిక సంఘాలు ఈ కొత్త కోడ్‌లపై తమ వ్యతిరేకతను తెలియజేశాయి. అదేదీ పట్టించుకోకుండా, రాష్ట్రాలను కూడా సంప్రదించకుండా కేంద్రం వీటి అమలు తేదీ ప్రకటించింది. వెంటనే వీటిపై డ్రాఫ్ట్ పాలసీ సిద్ధం చేసుకొమ్మని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీచేసింది.

సెప్టెంబర్ 2020 నాటికే సిద్ధంగా ఉన్న ఈ కోడ్‌లను అదను చూసుకొని బీహార్ ఎన్నికల్లో విజయం ఊపులో బీజేపీ ప్రభుత్వం అమలుకు సిద్ధపడింది. వీటికి వేతనాల కోడ్, పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తిపర భద్రతా-ఆరోగ్యం - పని ప్రదేశాల్లో పరిస్థితుల కోడ్ అని పేర్లు పెట్టారు. ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాల స్థానంలో ఇవి పనిచేస్తాయి. 4 వేతన చట్టాలు, 9 సామాజిక భద్రతా చట్టాలు, 9 వృత్తిపర భద్రతా, ఆరోగ్యం, పని చోట వసతుల చట్టాలు, 3 పారిశ్రామిక సంబంధాల చట్టాలు కలిపి 4కోడ్‌లుగా మార్చారు. అయితే, పాత చట్టాల స్థానంలో వచ్చిన కొత్త కోడ్‌లు ఏ విధంగా కార్మిక ప్రయోజనాలను కాలరాస్తాయో తెలుపుతూ కార్మిక సంఘాల నేతలు, విషయ నిపుణులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు. వీటిని కార్మిక వ్యతిరేక, యాజమాన్యాల అనుకూల చట్టాలుగా వారు పేర్కొంటున్నారు. ఉద్యోగులను విధుల్లోంచి తొలగించడానికి అనుకూలంగా, యాజమా న్యాలతో చర్చలకు, సమ్మెలకు ఇవి ఆటంకంగా ఉన్నాయి. యజ మాని బానిస సంబంధాలను తిరిగి తెస్తున్నాయని, పారిశ్రామిక రక్షణను తొలగిస్తూ సంఘాల ఏర్పాటు, సామూహిక ఆందోళనలను అడ్డుకుంటాయని, ఎంతో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలు నిరుపయోగమవుతాయని అంటున్నారు. వీటి అసలు ఉద్దేశం సంస్కరణ కాదు. ఉన్న హక్కులను, రక్షణను కార్పొరేట్ సంస్థలకు దాసోహం చేయడమే. ఏకపక్షంగా, అప్రజాస్వామ్యంగా ఉన్న ఈ క్రూరమైన చట్టాలను అమలుచేయవద్దని వారు కోరుతున్నారు.

దేశవ్యాప్తంగా ఆందోళన చేపట్టాలని, పని ప్రాంతాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించాలని కార్మిక సంఘాలు ఇప్పటికే నిర్ణయించాయి.

కేంద్రం తెచ్చిన ఈ కోడ్‌లు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే ఆచరణలోకి వచ్చాయి. ఉద్యోగ తొలగింపు సమయంలో చెల్లించే సొమ్ము విషయంలో 100 బదులు 300 ఉద్యోగులున్న పరిశ్రమలకు కూడా ఉపశమనం లభిస్తున్నది. కొన్ని రాష్ట్రాల్లో మహిళలను రాత్రి వేళ పనికి అనుమతించాలని కంపెనీలు ఒత్తిడి తెస్తున్నాయి. ఓవర్ టైమ్ లిమిట్‌ను 50 గంటల నుంచి 125 గంటలకు పెంచారు. విశాలమైన ఫెడరల్ వ్యవస్థలో ఇలాంటి ఏకరూప కార్మిక చట్టాలు ఉపయోగపడవు. స్థానిక అవసరాలు, కార్మికుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రాలు చట్టాలను ఏర్పాటుచేసుకుంటాయి. పాత్రికేయుల వేతన సంబంధ ప్రత్యేక చట్టం వేతన కోడ్‌లో లుప్తమైందని జర్నలిస్టులు ఆందోళన చెందుతున్నారు. ఇంకా ఎవరెవరి చట్టాలు ఈ సుడిగుండాల్లో ఎలా చిక్కుపడ్డాయో బయటపడాల్సి ఉన్నది. సెప్టెంబర్ 2020లో మోదీ ప్రభుత్వం తెచ్చిన 3 వ్యవసాయ చట్టాలను రైతులు తీవ్రంగా వ్యతిరేకించడం వల్ల 2021 నవంబర్‌లో వాటిని రద్దు చేస్తున్నట్టు ప్రకటిస్తూ మోదీ జాతికి క్షమాపణ చెప్పారు. ఇప్పుడు ఈ ఉత్పాతం కార్మికులపై పడింది. వారు ఏ స్థాయిలో తమ నిరసనను ప్రదర్శించి హక్కులు కాపాడుకుంటారో చూడాలి.

## పెన్షన్ కోసం మూడేళ్లుగా చనిపోయిన తల్లిలా వేషం వేసిన కొడుకు



న్యూఢిల్లీ: చనిపోయిన తల్లి పింఛను కోసం ఆమె అవతారం ఎత్తిన ఓ మోసగాడిని ఇటలీ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. కొన్నేళ్లుగా తల్లి మారువేషంలో దాదాపు రూ. 80 లక్షలను అక్రమంగా ఆ వ్యక్తి ప్రభుత్వం నుంచి కొల్లగొట్టినట్లు బయటపడింది. హారర్ చిత్రాన్ని తలపించే ఈ వ్యవహారం అందరినీ నివ్వెరపోయేలా చేస్తున్నది. ఇటలీలోని బోర్గో వర్జిలియోలో నివసించే ఓ 56 ఏళ్ల మంటోవా గతంలో నర్సుగా పనిచేసేవాడు. స్థానిక రిజిస్ట్రీ కార్యాలయంలో తన తల్లి గ్రాజియెల్లా గుర్తింపు కార్డును రెన్యువల్ చేసేందుకు వెళ్లిన ప్రతిసారీ తన తల్లిలా కనిపించేందుకు తలకు విగ్గు, పెదవులకు లిప్‌స్టిక్, ముఖానికి మేకప్, 1970 దశకంలో ఉపయోగించే బ్లౌజు, పొడుగు స్కర్టు, నెయిల్ పాలిష్, పాతకాలం నాటి చెవిరింగులు ధరించేవాడు. మూడేళ్ల క్రితం ఆ వ్యక్తి తల్లి డాల్ ఓగ్లియో మరణించగా ఆ విషయాన్ని వెల్లడించకుండా ప్రతినెలా ఆమె పింఛనును వసూలు చేసుకునేవాడు. అలా రూ.80 లక్షలు వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తన తల్లి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించకుండా.. మమ్మీలా మార్చి ఇంట్లో భద్రపర్చాడు. అయితే పింఛను కోసం వచ్చిన వృద్ధురాలి రూపంలో ఏదో తేడా ఉన్నట్లు ముందుగా రిజిస్ట్రీ ఉద్యోగి గుర్తించాడు. ఆమె మెడ బలంగా ఉంది. ముఖంలో మడతలు వింతగా ఉన్నాయి. చేతులపైన చర్మం వృద్ధురాలి చర్మంలా లేదు. గొంతులో కొంత ఆడతనం ఉన్నప్పటికీ అప్పుడప్పుడు మగగొంతు వినిపించేది అని రిజిస్ట్రీ ఉద్యోగి చెప్పినట్లు బోర్గో వర్జిలియో మేయర్ ఫ్రాన్సెస్కో తెలిపారు. పింఛను ఫారాలు నింపాలని పిలిపించి తన తల్లి వేషంలో వచ్చిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. తన నేరాన్ని అతను అంగీకరించినట్లు ఆయన తెలిపారు.

# ఖైరతాబాద్ కసరత్తు..!

**హైదరాబాద్,డిసెంబర్,13 :**ఈసారి మునుపటి లెక్క కాదు. కంటోన్మెంట్ చేజారింది..జూబ్లీహిల్స్ మిస్ అయ్యింది. ఆ రెండు సిట్టింగ్ సీట్లలో సెంటిమెంట్ వర్కవుట్ కాలేదు. ఖైరతాబాద్ బై ఎలక్షన్ వస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో గెలిచి తీరాల్సిందేనని పట్టుదలతో ఉంది బీఆర్ఎస్. ఇక చేజారిన జూబ్లీహిల్స్ పక్కనే ఉన్న ఖైరతాబాద్‌కు కూడా ఉప ఎన్నిక ఖాయమన్న ప్రచారం ఊపందుకుంది. పార్టీ ఫిరాయింపుల ఎపిసోడ్‌లో ఖైరతారాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు తప్పదన్న చర్చ జరుగుతోంది. దానంపై వేటు పడటమో లేక అంతకంటే ముందే ఆయన రిజైన్ చేయడమో? ఏదో ఒకటి పక్కా అని టాక్ వినిపిస్తోంది.జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఓటమితో తీవ్ర నిరాశలో ఉన్న బీఆర్ఎస్..కచ్చితంగా ఖైరతాబాద్‌లో గెలిచి తీరాలన్న కసితో ఉంది. అందుకోసం ఇప్పటి నుంచే కసరత్తు స్పీడప్ చేసింది. బలమైన అభ్యర్థి కోసం గులాబీ పార్టీ వేట మొదలుపెట్టింది. అధికార కాంగ్రెస్ నుంచి మళ్లీ దానం నాగేందర్ పోటీ చేస్తే ఒకలా..లేదంటే మరోలా రెండు ప్లాన్స్ రెడీ చేస్తోంది గులాబీదళం. దివంగత నేత పీజేఆర్‌కు ఖైరతాబాద్ లో అభిమానులు ఉండటంతో..ఆయన తనయుడు, జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ ను రంగంలోకి దించాలని అనుకుంటోందట బీఆర్ఎస్.ఒకసారి ఖైరతాబాద్ నుంచి, నియోజకవర్గాల పునర్విభజన తర్వాత జూబ్లీహిల్స్ నుంచి మరోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన విష్ణు..2023లో టికెట్ దక్కకపోవడంతో కారెక్కారు. మొన్న జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో విష్ణు టికెట్ ఆశించినా.. మాగంటి గోపీనాథ్ భార్య సునీతనే పోటీలో పెట్టారు గులాబీ బాస్ కేసీఆర్. కాబట్టి ఇప్పుడు ఖైరతాబాద్ ఉపఎన్నిక వస్తే విష్ణును పోటీ చేయిస్తే..పీజేఆర్ తనయుడిగా ఇప్పటికే ఆయనకున్న ఫాలోయింగ్‌తో ఖైరతాబాద్ లో దానం నాగేందర్‌కు గట్టి పోటీ ఇస్తాడని నమ్ముతోంది గులాబీ పార్టీ.ఇదే సమయంలో బీఆర్ఎస్ లో ఖైరతాబాద్ టికెట్ ను పలువురు ఆశిస్తున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి 2014లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిన మన్నె గోవర్ధన్ రెడ్డి తనకే అవకాశం ఇవ్వాలని కోరుతున్నారట. ఒకవేళ తనకు టికెట్ ఇవ్వకపోతే తన భార్య మన్నె కవితకు ఛాన్స్ ఇవ్వాలని అడుగుతున్నారు. ప్రస్తుతం ఖైరతాబాద్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్‌గా ఉన్నారు మన్నె కవిత. 2018, 2023 రెండుసార్లు బీఆర్ఎస్ దానం నాగేందర్‌కు టికెట్ ఇస్తే సీటు త్యాగం చేసి సహకరించానని..ఈసారి తనకు, లేకపోతే తన భార్య మన్నె కవితకు టికెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారట మన్నె గోవర్ధన్‌రెడ్డి.మరోవైపు ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కూడా గతంలో ఖైరతాబాద్ నుంచి పోటీ చేశారు. బీసీ ఈక్వేషన్‌లో దాసోజు పేరు కూడా బీఆర్ఎస్ పరిశీలిస్తోంది. వీరితో పాటు మరికొందరు నేతలు ఖైరతాబాద్ బీఆర్ఎస్ టికెట్ రేసులో ఉన్నారని..పార్టీ ముందు తమ ప్రతిపాదన పెట్టారని అంటున్నారు. దీంతో ఖైరతాబాద్ నుంచి ఎవరిని బరిలోకి దింపాలని బీఆర్ఎస్ ఆలోచనలో పడింది. జూబ్లీహిల్స్ మాదిరి కాకుండా ఈసారి ఖైరతాబాద్ లో కచ్చితంగా గెలిచి తీరాలన్న పట్టుదలతో ఉన్న గులాబీ పార్టీ.. బలమైన అభ్యర్థి కోసం వడపోస్తోందట...!

# ఏపీలో మ్యాజిక్ డ్రెయిన్స్

**ఏలూరు,డిసెంబర్,13 :**పల్లెల్లో మురుగునీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించేం దుకు మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 106 గ్రామ పంచాయతీలలో మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నారు. తొలివిడతగా 59 కిలోమీటర్ల మేరకు ఈ మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం జరగనుంది. తక్కువ ఖర్చు, దుర్వాసన లేకపోవటం, మెరుగైన నిర్వహణ వంటి కారణాలతో ప్రభుత్వం సిమెంట్ డ్రెయిన్ల బదులుగా మ్యాజిక్ డ్రెయిన్ల వైపు మొగ్గు చూపుతోంది. ఏపీలో ఇప్పటికే కొన్నిచోట్ల వీటి నిర్మాణం జరిగింది. అక్కడ మంచి ఫలితాలు వస్తూ ఉండటంతో మరికొన్ని చోట్ల నిర్మించనున్నారు.పల్లెలలో పారిశుద్ధ్య నిర్వహణ, పరిశుభ్ర వాతావరణం ఏర్పాటు చేసే దిశగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా రాష్ట్రంలోని 106 గ్రామ పంచాయతీలల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనుంది. గ్రామీణాభివృద్ధి శాక చీఫ్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ గోపీచంద్ ఈ విషయాన్ని వెల్లడించారు. 106 గ్రామపంచాయతీల పరిధిలో 59 కిలోమీటర్ల మేరకు మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించనున్నట్లు ఆయన వెల్లడించారు. గ్రామాలలో మురుగునీటి వ్యవస్థను సక్రమంగా నిర్వహించాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అందులో భాగంగానే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టనుంది. పైలెట్ ప్రాజెక్టు కింద ఇప్పటికే మ్యాజిక్ డ్రెయిన్లు ఏర్పాటు చేశారు. ఇవి సత్ఫలితాలు ఇస్తూ ఉండటంతో 106 గ్రామపంచాయతీలలో వీటిని నిర్మించాలని భావిస్తున్నారు. తొలి విడతగా 59 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు. మూడు నెలల తర్వాత మ్యాజిక్ డ్రెయిన్లను పూర్తిస్థాయిలో అమలు చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు భావిస్తున్నారు. మరోవైపు మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మురుగునీటి సమస్యలకు.. తక్కువ ఖర్చుతో సమర్థవంతమైన పరిష్కారం లభిస్తుందని అధికారులు చెప్తున్నారు. అలాగే దుర్వాసన, దోమలు, కాలుష్యం వంటి సమస్యలకు చెక్ పెట్టవచ్చని భావిస్తున్నా రు. ఇక ఆర్థికంగానూ ఇది మంచి పరిష్కారం కానుంది. ఒక కిలోమీటర్ మేరకు సిమెంట్ డ్రెయిన్ నిర్మించాలనే సుమారుగా రూ. 50 లక్షలు ఖర్చు అయితే.. ఈ మ్యాజిక్ డ్రెయిన్లు అయితే రూ.7.5 లక్షలకే పూర్తవుతుందని అధికారులు చెప్తున్నారు. అలాగే మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి తక్కువ స్థలం సరిపోతుంది.

మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వచ్చే అవకాశం ఉండదు.మ్యాజిక్ డ్రెయిన్ నిర్మాణం కోసం తొలుత 2 అడుగుల లోతు, అరమీటర్ వెడల్పు ఉండేలా ఓ కాలువను తవ్వుతారు. దాని పైపొరలో గులకరాళ్లు 8 అంగుళాల మేర నింపుతారు. దాని మీద కంకర రాళ్లు 4 అంగుళాల మేరప రుస్తారు. చివరిగా గంగ్ర ఇసుక పోస్తారు. ఇలా మూడు పొరలతో ఈ మ్యాజిక్ డ్రెయిన్ నిర్మిస్తారు.

## అందరూ మిత్రులే...

**విజయవాడ,డిసెంబర్,13 :**ఏ రాష్ట్రంలోనైనా ప్రాంతీయ పార్టీలు ప్రత్యర్థులుగా ఉంటూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని ఒకరు మద్దతిస్తే, మరొకరు వ్యతిరే కిస్తారు. కానీ ఏపీ రాజకీయాల తీరు వేరు. 2014 లోరాష్ట్రవిభజన జరిగిన నాటి నుంచి ఇక్కడ ప్రధాన ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలు కేంద్రంలో ఉండే బీజేపీ వైపు నిలుస్తున్నాయి. 2014 ఎన్నికల్లో టీడీపీనేరుగా బీజేపీతో పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ంది. అదే సమయంలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ కూడా కేంద్రంలో ఉన్నబీజేపీకి అనేక సందర్భాల్లో మద్దతుగా నిలిచింది. ఇక నాడు ప్రారం భమయిన దోస్తీనేటి వరకూ కొనసాగుతూనే ఉ ంది. 2014లో కేంద్రం లో, రాష్ట్రంలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన టీడీపీ, బీజేపీలు తర్వాత విభేదాలతో విడిపోయాయి.

# ఆ నేతలు ఇద్దరు ఆల్ హ్యాపీసేనా..!

**విశాఖపట్టణం,డిసెంబర్,13 :**మాజీ మంత్రి,టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మధ్య రేగిన వివాదాన్ని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు మలుపు తిప్పారు. ప్రజా ఫిర్యాదులపై ఏర్పడిన శాసనసభ కమిటీ సమావేశాన్ని విశాఖలో ఏర్పాటు చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కూటమి పార్టీలోని ఇద్దరు నేతలతో సమావేశమయ్యారు.వారిద్దరితో అసలేం మాట్లాడారో ఎలా సర్ది చెప్పారో కానీ, రెండు రోజుల క్రితం చిర్రుబుర్రులాడిన గంటా.. ఎమ్మెల్యే విష్ణుతో చేతులు కలిపారు. దీంతో ఆ ఇద్దరి మధ్య చెలరేగిన వివాదానికి ఫుల్ స్టాప్ పడినట్లేనని చర్చ జరుగుతోంది. ప్రజా ఫిర్యాదులపై ఏర్పడిన శాసనసభ కమిటీకి అధ్యక్షత వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామక్రిష్ణంరాజు తొలి సమావేశాన్ని విశాఖలో ఏర్పాటు చేశారు.ఈ కమిటీలో రఘురామతోపాటు ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్ రాజు, పల్లా శ్రీనివాసరావు, జగన్మోహన్, కొణతాల రామకృష్ణ సభ్యులుగా ఉన్నారు. అయితే రెండు రోజుల క్రితం విశాఖ నగరానికి చెందిన ఎమ్మెల్యేలు గంటా, విష్ణుకుమార్ రాజు మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే.ఇది జరిగిన రెండు రోజులకు డిప్యూటీ స్పీకర్ రఘురామ ఎంట్రీతో ఆ ఇద్దరి మధ్య గొడవకు శుభం కార్డు పడిందని అంతా చెబుతున్నారు. కూటమిలో ఉంటూ విపక్షంలా వ్యవహరించడం సరికాదన్న రీతిలో ఇద్దరూ ఇప్పుడు ఒక్కటైపోయారంట. పార్టీలు వేరైనా కూటమిలో కలిసికట్టుగా ఉంటూ విశాఖ అభివృద్ధి కోసం పాటుపడాలని ఇద్దరు సీనియర్ నేతలు కోరుకుంటున్నారని జిల్లా రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. విశాఖ ఫిల్మ్ నగర్ భూముల లీజు విషయంలో స్థానిక ఎమ్మెల్యే గంటాకు తెలియకుండా బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు మిగిలిన ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టర్ కు వినతి పత్రం పంపడం వివాదానికి దారితీసింది. ఈ అంశంపై విశాఖ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక సందర్భంగా కలుసుకున్న విష్ణు, గంటా.. ఫిల్మ్ నగర్ లీజుల విషయంపై బహిరంగంగా వాదులాడుకున్నారు.

ఈ విషయంలో బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు క్షమాపణ చెప్పినా, గంటా తీవ్ర మనస్థాపంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.విశాఖ ఫిలింనగర్ క్లబ్ కు గత ప్రభుత్వం కేటాయించిన 5 ఎకరాల భూమికి సంబంధించి కలెక్టర్ ను కలిసి విష్ణుకుమార్ రాజు లేఖ ఇవ్వడంపై గంటా మండిపడ్డారట. తన సంతకం లేకుండా తన నియోజకవర్గానికి సంబంధించిన అంశంపై కలెక్టర్ కు లేఖ ఎలా ఇస్తారంటూ విష్ణుపై గంటా ఆగ్రహం వ్యక్తం చేశారట.దీనిపై విష్ణుకుమార్ రాజు స్పందిస్తూ ఫిల్మ్ క్లబ్ కు కేటాయించిన భూమి అలాట్ మెంట్ లెటర్లో 33 ఏళ్లు అనేది మిస్సయ్యిందని దీనిపై కరెక్షన్ చేయడానికే కలెక్టర్ ని కలిసి లేఖ ఇచ్చినట్లు వివరణ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే సంతకం తీసుకుని కలెక్టర్ కి ఇవ్వాలని..అలా జరక్కపోవడంతో గంటాకు విష్ణు సారీ కూడా చెప్పారట. దీంతో ఇద్దరి మధ్య తలెత్తిన విభేధాలు,
రఘురామ ఎంట్రీతో సద్దుమణిగినట్టేనని అంటున్నారు. విష్ణు వర్సెస్ గంటా మధ్య గొడవలు ఇప్పటివి కావని..ఎప్పటినుంచో ఇద్దరి మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమంటోందన్న చర్చ విశాఖ జిల్లా రాజకీయాల్లో నడుస్తోంది. జు ఎమ్మెల్యే. దాన్ని ఆయన కంచుకోటగా మార్చుకున్నారు. 2014లో అదే నియోజకవర్గం నుంచి టీడీపీ-బీజేపీ అభ్యర్థిగా రాజు గెలుపొందారు.

# చలికాలంలో ఆరోగ్య రక్షణ ఇలా



చలికాలంలో పిల్లల నుంచి పెద్దల వరకూ అందరికీ అనారోగ్య సమస్యలు వస్తూనే ఉంటాయి. ఎక్కువగా దగ్గు, జ్వరం, జలుబు వంటివి పీడిస్తుంటాయి. ఈకాలంలో వైరస్, బ్యాక్టీరియా సులభంగా వ్యాప్తిచెందుతాయి. చిన్న పిల్లలు జబ్బుల బారినపడుతుంటారు. ఈ క్రమంలో పిల్లల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రధానంగా కేంద్రీకరించాలి. రోగనిరోధక శక్తి తక్కువగా ఉండే పిల్లల ఆరోగ్యంపై ఈ కాలంలో ప్రత్యేక శ్రద్ధఅవసరం.

దుస్తులు : సీజన్ మారినప్పుడు వాతావరణంలో వచ్చే మార్పులు పిల్లలకు ఇబ్బంది కలిగిస్తాయి. పిల్లల ముఖం, శరీరంపై సూక్ష్మక్రిములు దాడి చేస్తాయి. అందువల్ల పిల్లలకు డ్రెస్ విషయంలో ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖం, శరీరం మొత్తం కప్పి ఉంచే డ్రెస్ వెయ్యాలి. చలి తగలకుండా.. వెచ్చదనం ఉండేలా చెయ్యాలి. ఫుల్ స్లీవ్స్, మంకీ క్యాప్స్, ఫుల్ లెంగ్త్ పాంట్స్ వాడాలి.

పరిశుభ్రత : పిల్లల గది, ఆడుకునే ప్రదేశాలు, చదువుకునే ప్రదేశం అన్నీ పరిశుభ్రంగా ఉండేలా చూడాలి. పిల్లలు ఎక్కువగా ఇండోర్స్‌లోనే ఉంటారు కాబట్టి.. ప్రతి రోజూ ఇల్లు పరిశుభ్రంగా ఉంచాలి. పిల్లలకు వాడే బట్టలు, సాక్స్, స్కూల్ బ్యాగ్స్, బొమ్మలు అన్నీ పొడిగా, శుభ్రంగా ఉండాలి. పిల్లల రోగ నిరోధకశక్తి బలంగా ఉండాలి. తినడానికి ముందు తరువాత చేతి పరిశుభ్రతను పాటించేలా చూడాలి. పిల్లల పరిసరాలు, వస్తువులను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉండేలా చూడాలి.

సరైన ఆహారం : పిల్లలు తినే ఆహారంపైనే వారి ఇమ్యూనిటీ ఆధారపడి ఉంటుంది. అందువల్ల వ్యాధి నిరోధక శక్తిని పెంచే ఆహారం ఎక్కువగా ఇవ్వాలి. పాలు, పండ్లు, గుడ్లు, కూరగాయలు, ఆకుకూరలను ఎక్కువగా ఇవ్వాలి.

నీరు : చలికాలంలో చర్మం త్వరగా పొడిబారిపోతుంది. అందువల్ల పిల్లలతో నీరు బాగా తాగిస్తూ ఉండాలి. నీరు చర్మాన్ని తేమగా ఉంచి.. బ్యాక్టీరియాతో పోరాడేలా చేస్తుంది. నీటి వల్ల శరీరం.. విష వ్యర్థాలను బయటకు పంపేందుకు వీలవుతుంది.

నిద్ర : చలికాలంలో పిల్లలు బాగా నిద్రపోయేలా చెయ్యాలి. తద్వారా వారి ఇమ్యూనిటీ బాగా పెరుగుతుంది. శారీరకంగా కూడా పిల్లలు ఎదిగేందుకు నిద్ర చాలా అవసరం. రోజూ కనీసం 7 గంటలైనా పడుకునేలా చెయ్యండి.

టీకాలు వేయించాలి: ఇన్ఫ్లుయెంజా వ్యాక్సిన్‌తో పిల్లలకు దగ్గు, జలుబు, జ్వరం రాకుండా ఉంటుంది. వీటిని ఏడాది పిల్లలకు రెండుసార్లు వేస్తారు. ఆ తర్వాత ఐదేళ్ల వరకు ఏటేటా ఒక్కొక్కటి చొప్పున తీసుకోవాలి. సీజనల్ టీకాలు వేయించాలి. చిన్నపిల్లలు ఉండే గదులను పరిశుభ్రంగా ఉంచాలి. చల్లటి వాతావరణంలో అనేక వైరస్‌లు విజృంభిస్తాయి. పిల్లలు పాఠశాల నుంచి వచ్చిన తర్వాత అల్పాహారం తీసుకునే ముందు చేతులు, కాళ్లు బాగా కడగాలి. విటమిన్ సి, ఐరన్, జింక్ వంటి మినరల్స్ అధికంగా ఉన్న ఆహారాన్ని అందిస్తే నిరోధక శక్తి పెంపొందుతుంది. పండ్లు, కూరగాయలు, గోధుమలు, నాటు గుడ్లు వంటివి ఇందులో చేర్చాలి.

చలి కాలంలో శరీరానికి చెమట ఎక్కువగా పట్టనందున పిల్లలు తక్కువ నీరు తాగుతుంటారు. వీలైనంత వరకు అవసరమైనంత గోరువెచ్చని నీరు అందించాలి.

చల్లని గాలులతో పిల్లలకు జ్వరంతోపాటు శ్వాసకోస సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఒక్కోసారి జలుబు అధికమైతే పిల్లలకు ఆయాసం రావొచ్చు. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్యులను సంప్రదించాలి. సాధారణంగా జబ్బు చేసిన ప్రతిసారీ వారికి యాంటీబయాటిక్ ఇస్తుంటారు. జలుబు, దగ్గుకు సొంతంగా ఔషధాలు వేస్తుంటారు. ఇలా ప్రతిసారీ ఇవ్వడంతో సహజమైన రోగ నిరోధక శక్తి తగ్గిపోతుంది. సకాలంలో వైద్యులను సంప్రదించి తగిన వైద్యం అందించాలి.

వ్యాయామం: పిల్లలు బయటికి వెళ్లి సూర్యకాంతిలో ఆడుకునేలా ప్రోత్సహించాలి. రెగ్యులర్ వ్యాయామం పిల్లల పూర్తి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

సీజనల్ మార్పులతో: ఉదయం చలి కారణంగా ఇంటి నుంచి బయట అడుగు పెట్టాలని అనిపించదు. దీనినే సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ అని కూడా అంటారు. రోజులో ఎక్కువ భాగం నీరసంగా, విచారంగా లేదా నిరుత్సాహంగా అనిపిస్తుంది. ఒకప్పుడు ఆనందించిన కార్యకలాపాలపై ఆసక్తి కోల్పోతారు. అతిగా నిద్రపోతారు.

ఒంటి నొప్పులే అధికమే: ఉదయాన్నే ఒళ్లంతా నొప్పులతో నిద్రలేవడానికి చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. కొందరైతే కీళ్ల నొప్పులతో లేచి నడవలేని పరిస్థితి ఉంటుంది. అందుకే శీతాకాలంలో శరీరాన్ని వీలైనంత వెచ్చగా ఉంచుకోవాలి. చలికాలంలో ఒళ్లు నొప్పులు మరింతగా బయటపడతాయి. అలాంటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి.

కీళ్లపై ఒత్తిడి : చలి పెరిగే కొద్దీ, వాతావరణ పీడనం తగ్గుతుంటుంది. ఈ పీడన మార్పు వల్ల కీళ్ల చుట్టూ ఉన్న కండరాలు, స్నాయువులు, లిగమెంట్లు కొద్దిగా ఉబ్బుతుంటాయి. దీని కారణంగా కీళ్లపై ఒత్తిడి పెరగడం వల్ల నొప్పి, పట్టేసినట్టు అనిపిస్తుంది. ఆర్థరైటిస్ వంటి సమస్యలు ఉన్నవారికి ఈ నొప్పి ఎక్కువగా ఉంటుంది. వాతావరణ పీడనంలో మార్పులు మైగ్రేన్లు, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఫైబ్రోమైయాల్జియా, ఆస్టియో ఆర్థరైటిస్-ప్రేరిత నొప్పి, వెన్నునొప్పి, న్యూరోపతిక్ నొప్పి వంటి వివిధ రకాల నొప్పికి కారణమవుతాయి. నొప్పులు ఎక్కువగా ఉంటే డాక్టరును సంప్రదించాలి.

జాగ్రత్తలివే: రాత్రి వేళ చల్లని గాలులు గదిలోకి రాకుండా చూసుకోవాలి. బయట చలిగా ఉన్న సమయంలో పిల్లలను ఎక్కువ సమయం బయట గడపకుండా జాగ్రత్తలు వహించాలి.

వెచ్చగా ఉండేందుకు మందంగా ఉండే దుస్తులు లేదా స్వెట్టర్లు ధరింపజేయాలి. తలకు మఫ్లర్ (టోపీ), చేతులకు గ్లౌజులు, పాదాలకు సాక్స్ వంటి అదనపు రక్షణ దుస్తులు ధరించాలి.

చలికాలంలో ముఖం, చేతులువబ, పాదాలు, మడమలు పగిలిపోవడం సాధారణం. తల స్నానానికి ముందు నూనె రాసి కాసేపు ఉంచిన తర్వాత స్నానం చేయించాలి. స్నానం వేడి నీటితో చేయించాలి. ఆ తర్వాత పొడిగా ఉండే దుస్తులను వేయాలి.

## జాతీయ పోటీలకు ఎంపికైనా పెద్దపెల్లి కరాటే క్రీడకారులు

### రాష్ట్ర స్థాయిలో ముగ్గురికి బంగారు పథకాలు



**రామగుండం,డిసెంబర్,12 :**తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా నిర్వహిస్తున్న స్కూల్ గెమ్స్ ఆఫ్ ఫెడరల్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పెద్దపల్లి జిల్లా కరాటే క్రీడకారులు అత్యంత ప్రతిభ కనబ ర్చారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో అండర్ 14 విభాగంలో 23,24 తేదిల్లో జరిగిన రాష్ట్ర స్థాయి సెలెక్షన్ లో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఎం.ముక్తిశ్రీ, సునీహసుల్తానా, పవన్ కుమార్ బంగారు పథకాలు సాధించారు.-26హేమలత మహాజీ,-20 బాలుర విభాగంలో బి శ్రీమన్ కాంస్య పతకం సాధించారు. డిసెంబర్ 14 నుండి 19 వరకు మధ్యప్రదేశ్ ఇండోర్ లో స్కూల్ గెమ్స్ ఫెడరేషన్ ఇండియా జాతీయ పోటీలకు ముగ్గురు క్రీడాకారులు ఎంపికైయ్యారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పథకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనా క్రీడాకారులను జపాన్ షటోరియో కరాటే స్కూల్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు తగరపు శంకర్,రాష్ట్ర కార్యదర్శి, ఏం రమేష్, కోశాధికారి, శ్రీనివాస్ యాదవ్,జపాన్ సిటోరియో కరాటే స్కూల్ గౌరవ అధ్యక్షులు రాజ్ కుమార్ ,స్పందన క్లబ్ సెక్రటరీ డాక్టర్ కే నరేంద్ర సోనీ,స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ గణేష్ రాజ్, సీనియర్ ఇన్స్ట్రక్టర్స్ ఎస్ శ్రీనివాస్, బి పరమేష్, శ్రావణ్ కుమార్ పటేల్, రోహిత్ కుమార్, నిదేశ్ కుమార్, శైలజ, సంజన, అభిజ్ఞ, శుభ శ్రీ, మరియు తల్లిదండ్రులు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు.

## సంక్రాంతి వరకు ఆప్కో వస్త్రాలపై రిబేటు

**అమరావతి,డిసెంబర్,12 :**రాష్ట్ర ప్రజలకు ఆప్కో షోరూమ్‌లలో చేనేత వస్త్రాలపై 40శాతం రాయితీని సంక్రాంతి వరకూ అమలు చేయనున్నట్లు చేనేత, జౌళిశాఖ మంత్రి ఎస్‌సవిత తెలిపారు. పండగల నేపథ్యంలో ప్రవేశపెట్టిన రాయితీని ప్రజలు, వినియోగదారుల నుంచి వచ్చిన స్పందన నేపథ్యంలో సక్రాంతి వరకూ కొనసాగించాలని నిర్ణయించినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాయితీ అమ్మకాలతో ప్రజలకు చేనేత వస్త్రాలను మరింత చేరువ చేసే అవకాశం కలుగుతుందన్నారు.

అలాగే వస్త్రాల విక్రయాల పెరుగుదలతో నేతన్నలకు ఆర్థిక భరోసాతో కూడిన ఉపాధి లభిస్తుందని తెలిపారు. రాయితీ ఇవ్వడానికి ముందు రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కో షోరూమ్‌లలో రోజుకు సరాసరి రూ. 3 లక్షలు చొప్పున విక్రయాలు జరిగేవని, రాయితీ ఇవ్వడంతో ప్రస్తుతం రూ. 9 లక్షలకు పెరిగినట్లు మంత్రి పేర్కొన్నారు.

# చెత్తను వేయకుండా సూపర్ ప్లాన్

**విశాఖపట్టణం,డిసెంబర్,12 :** ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయకుండా నివారించేందుకు గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకారంతో దీనిని అమలు చేస్తోంది. చెత్త వేసే ప్రదేశాలను శుభ్రపరిచి.. దేవుడి ఫోటోలు, మొక్కల కుండీలు, ముగ్గులు ఏర్పాటు చేస్తున్నారు. దీని ద్వారా ఆ ప్రదేశంలో మరోసారి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని ప్రదేశాల్లో ఇది మంచి ఫలితాలు ఇవ్వటంతో త్వరలోనే విశాఖ నగరం మొత్తం అనుసరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.వీధుల్లో నడిచివెళ్లేటప్పుడూ.. కొన్నిసార్లు గోడలపై గమనించే ఉంటారు.. ఇక్కడ మూత్రం పోసిన వాడు గాడిద. ఇక్కడ చెత్త వేస్తే శిక్షార్హం.. అంటూ కొటేషన్లు, హెచ్చరిక బోర్డులు గమనించే ఉంటారు. ఎవరెన్ని కొటేషన్లు రాసినా.. అధికారులు ఎన్ని హెచ్చరికలు చేసినా కొంతమంది మాత్రం పద్ధతి మార్చుకోరు. పరిశుభ్రతతో పనిలేదు.. అధికారుల హెచ్చరికలతో అస్సలు అవసరం లేదు.. తమ పంథా తమదే..తమ పని తమదే. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. చెత్త వేసేస్తూ ఉంటారు. ప్రభుత్వం ఇంటింటికీ చెత్త సేకరణ జరుపుతున్నా.. చెత్త కుండీలు ఏర్పాటు చేసినా కూడా ఇలాంటి వారిలో మార్పులు ఆశించడం అత్యాశే అవుతోంది. కాలనీలలోని ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు, చెత్తను పారబోస్తూ అపరిశుభ్ర వాతావరణానికి కారణమవుతున్నారు. అలాంటి చోట్ల అధికారులు బోర్డులు ఏర్పాటు చేసినప్పటికీ ఇలాంటి వారిలో ఎలాంటి మార్పూ లేదు.దీంతో ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) ఓ సరికొత్త ఆలోచన చేసింది. స్థానికుల సహకారంతో ఈ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేస్తూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తోంది. ఎక్కడైతే వ్యర్థాలను పారేస్తున్నారో అలాంటి ప్రదేశాలను గుర్తించి.. ఆ ప్రాంతాన్ని పరిశుభ్రం చేస్తున్నారు. ఆ తర్వాత దేవుడి ఫోటోలు పెట్టి.. ముగ్గులు వేస్తున్నారు. మరికొన్ని చోట్ల కుండీలలో మొక్కలు ఉంచుతున్నారు. ప్రయోగాత్మకంగా



కొన్ని చోట్ల ఈ పద్ధతి అనుసరించగా సత్ఫలితాలు వచ్చాయి. అందుకే విశాఖపట్నం నగరం మొత్తం ఈ విధానం అనుసరించాలనిజీవీఎంసీ ఆలోచనలు చేస్తోంది. దేవుడి ఫోటోలు పెట్టడం, ముగ్గులు పెట్టటంతో చెత్త వేసేవారిలో మార్పు వస్తోంది.

తమ చర్యలను విరమించుకుంటున్నారు. దీంతో విశాఖపట్నం మొత్తం ఈ కార్యక్రమం అమలు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వవార్డులో ఉన్న ఎంవీపీ కాలనీ సెక్టార్?9లో ఇటీవల జీవీఎంసీ ఈ కార్యక్రమం నిర్వహించింది. పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన పరిసరాలను నిర్వహించడంపై స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కార్పొరేటర్ గోలగాని మంగవేణి ప్రజలు తమ పరిసరాలను చెత్త లేకుండా ఉంచుకోవాలని కోరారుచెత్త వేసే ప్రాంతంలో శుభ్రం చేసి ముగ్గులు వేశారు.

అలాగే బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను పారేసే వారిపై కఠినమైన జరిమానాలు విధిస్తామని జీవీఎంసీ అధికారులు హెచ్చరిస్తున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తున్నారు. అలా కాదని నిబంధనలు అతిక్రమించి చెత్త వేస్తే వేయి రూపాయలు జరిమానా విధిస్తామని హెచ్చరిస్తున్నారు.

# 2వేల 200 కిలోమీటర్లకు గ్రేటర్ హైదరాబాద్




**హైదరాబాద్,డిసెంబర్,12 :** తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్ఎంసీని విస్తరించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఓఆర్ఆర్‌ను (ఔటర్ రింగ్ రోడ్) ఆనుకుని ఉన్న 27అర్బన్ లోకల్ బాడీలను (మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు) జీహెచ్ఎంసీలో విలీనం చేయాలని నిర్ణయించింది. అందుకు అనుగుణంగా తెలంగాణ మునిసిపల్ యాక్ట్, జీహెచ్ఎంసీ యాక్ట్‌ను సవరణ చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అంతేకాకుండా రాష్ట్రంలో మరో కొత్తడిస్కం (మూడోది) ఏర్పాటునకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త డిస్కం పరిధిలోకి ఇరిగేషన్ కనెక్షన్లు, హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లయ్, వ్యవసాయ కనెక్షన్లు, మిషన్ భగీరథ కనెక్షన్స్ వస్తాయన్నారు.ఇక, ప్రతి కార్పొరేటర్ డివిజన్ కు రూ. 2కోట్ల విడుదలకు కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. అటు 27 మున్సిపాలిటీ లు, కార్పొరేషన్లు ఉఊఓఅలో కలిపుతూ ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయం జీహెచ్ఎంసీ కౌన్సిల్ ముందు పెట్టారు మేయర్. 2 కోట్ల వరకు పనులకు నిధులు మంజూరు చేయడం మంచి నిర్ణయం అని కార్పొరేటర్లు అన్నారు. 2007 వరకు ఓఅఊ 173 చదరపు కిలోమీటర్లు ఉండేది. 2009కి ముందు 100 డివిజన్లు, 2009 తర్వాత 150 డివిజన్లు వచ్చాయి. 625 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరించింది. ఇప్పుడు జీహెచ్ఎంసీ భారీగా విస్తరించనుంది. ఔటర్ రింగ్ రోడ్ వరకు విస్తరిస్తే 2వేల 200 చదరపు కిలోమీటర్ల వరకు విస్తరణ జరిగే అవకాశం ఉంది. దీంతో ఉఊఓఅలో డివిజన్లు భారీగా పెరగనున్నాయి.పెద్ద అంబర్ పేట్,జల్‌పల్లి, శంషాబాద్, తుర్కయంజాల్, మణికొండ, నార్సింగి, ఆదిభట్ల,తుక్కుగూడ, మేడ్చల్,నాగారం, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి, తూంకుంట, కొంపల్లి, అమీన్‌పూర్, బడంగ్‌పేట్, బండ్లగూడ జాగీర్, మీర్‌పేట్, బోడుప్పల్, నిజాంపేట్, దుండిగల్, బొల్లారం, తెల్లాపూర్, ఫిర్జాదిగూడ, జవహర్‌నగర్. ఈ విలీనం ద్వారా జీహెచ్ఎంసీ పరిధి, జనాభా భారీగా విస్తరించనుంది.ఇక రాష్ట్రంలో మూడో డిస్కం (విద్యుత్ పంపిణీ సంస్థ) ఏర్పాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రస్తుతం ఉన్న టీజీఎస్‌పీడీసీఎల్, టీజీఎన్‌పీడీసీఎల్‌పై ఉన్న రూ. 59,671 కోట్ల నష్టాల భారాన్ని తగ్గించడానికి పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు ప్రస్తుత డిస్కంల పరిధిలో ఉండగా.. మిషన్ భగీరథ, మెట్రో వాటర్ బోర్డులకు సంబంధించిన విద్యుత్ సరఫరాను కొత్త డిస్కం పరిధిలోకి తీసుకురానున్నారు.

# రామగుండంలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంటు ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం

**శాసనసభ్యులు శ్రీ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ కల సాకారం**

**వేలాదిమంది యువతకు ఉపాధి అవకాశాలు**

**గోదావరిఖనిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సంబరాలు**

**గోదావరిఖని,డిసెంబర్,12 :** హైదరాబాదులో జరిగిన మంత్రివర్గ క్యాబినెట్ సమావేశ ంలో రామగుండంలో ఎనిమిది వందల మెగావాట్ల సామర్థ్యంకలిగినకొత్త విద్యుత్ ప్లాంటు ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీనితో రెండు సంవత్సరాలుగా ఎమ్మెల్యే శ్రీ రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్‌కల సాకారమైంది. తద్వారా పారిశ్రామిక ప్రాంతంలో అర్హత కలిగిన యువతకు ఉపాధి అవకాశాలు కలిగే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా గోదావరిఖని పట్టణ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు బొంతల రాజేష్, దీటి బాలరాజు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా రామగుండంలోని బి-పవర్ హౌస్ లో 800 మెగావాట్ల కొత్త విద్యుత్ ప్లాంటు ఏర్పాటు కోసం ఎమ్మెల్యే చేసిన ప్రయత్నం సాకారమైందని అన్నారు. రామగుండం కు భవిష్యత్తులో మహార్దశ ఉందని పేర్కొన్నారు. ఇటీవల 900 కోట్లతో నియోజకవర్గంలో ఎమ్మెల్యే సారధ్యంలో అన్ని విధాల అభివృద్ధి పనులు చేస్తున్నామని పేర్కొన్నారు. కొత్త విద్యుత్ ప్లాంటు పూర్తి అయితే స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. గత బిఆర్ ఎస్ ప్రభుత్వం చేతగానితనంతో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. చిల్లర మాటలతో ప్రజలను మభ్య పెట్టారని పేర్కొన్నారు.


### హస్తినపై మనస్సులో..

# అమరావతిలో తనువు

**ఏలూరు,డిసెంబర్,12 :**డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఎమ్మెల్యే పదవి పట్ల సంతృప్తిగా లేరు. ఆయన చూపంతా హస్తినపైనే ఉంది. గత ఎన్నికల సమయంలో రఘురామ కృష్ణరాజు నరసాపురం పార్లమెంటు టిక్కెట్ కోసం చివర వరకూ ప్రయత్నించారు. అయితే అది బీజేపీ కోటాలోకి వెళ్లిపోవడంతో ఆయనకు ఎక్కడో ఒకచోట స్థానం కల్పించాలన్న ఉద్దేశ్యంతో ఉండి శాసనసభ నుంచి టీడీపీ పోటీ చేయించింది. గెలిచిన తర్వాత డిప్యూటీ స్పీకర్ పదవిని అప్పగించింది. కేబినెట్ ర్యాంకు పదవి అయినప్పటికీ ఆయన మనసంతా ఢిల్లీపైనే ఉంది. వచ్చే ఎన్నికల నాటికి తాను పార్లమెంటు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నట్లే కనపడుతుంది. ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇలాగే ఉంటున్నాయి.ఆయన తన సన్నిహితుల వద్ద చేస్తున్న వ్యాఖ్యలు కూడా ఇలాగే ఉంటున్నాయి.

అయితే అప్పటికే ఉండి నియోజకవర్గానికి సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మంతెన రామరాజు ను ఒప్పించి రఘురామ కృష్ణరాజుకు టీడీపీ నాయకత్వం ఆ సీటును కేటాయించింది. మంతెన రామరాజుకు నామినేటెడ్ పోస్టు ఇచ్చింది. ఆయనను ఏపీఐఐసీ ఛైర్మన్ గా నియమించింది. పదవి దక్కకపోవడంతో ఆయన అసంతృప్తిగా ఉన్నారని సమాచారం. నాగరాజు శెట్టి బలిజ సామాజికవర్గం నేత కావడంతో ఆయన తన అసంతృప్తిని సన్నిహితుల ముందు వెళ్లగక్కుతున్నారట.మరొకవైపు డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు మాత్రం వచ్చే ఎన్నికల్లో ఉండి నుంచి పోటీ చేయడానికి పెద్దగా ఇష్టపడటం లేదు. రఘురామ కృష్ణరాజుకు రాష్ట్ర రాజకీయాల కంటే ఢిల్లీలో ఉండటమే ఎక్కువగా ఇష్టపడతారు.

# ఆత్మహత్యలను నివారించాలి



డిసెంబర్ నెల వచ్చిందంటే విద్యార్థుల్లో పరీక్షల గురించి ఆందోళన ప్రారంభం అవుతుంది. ఒకవైపు సిలబస్ పూర్తి చేసే హడావిడిలో ఉపాధ్యాయులు, అధ్యాపకులు వుంటారు. మరోవైపు వివిధ ప్రవేశ పరీక్షలకు నోటిఫికేషన్స్ విడుదల అవుతుంటాయి. ఇంకోవైపు వివిధ వివిధ కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు వసూలు చేసుకునే పనిలో బిజీ అవుతాయి. ర్యాంకులు, మార్కుల ఒత్తిడిలో విద్యార్థులు నలిగి పోతుంటారు. ఫలితంగా కొందరు తీవ్ర నిరాశతో తామెందుకూ పనికి రామనే భావనకు గురవుతారు. ప్రాణాలు తీసుకునేంత బలహీనులుగా మారతారు. ఇటీవల విద్యార్థుల ఆత్మహత్యల వార్తలను ఎక్కువగా వినాల్సి వస్తోంది. పిల్లల్లో నిరాశ, నిస్పృహ ధోరణులు కనిపిస్తే- తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తం కావాలి. వారికి తగిన ధైర్యాన్నివ్వాలి.

మారుతున్న కాలానికి తగ్గట్లుగా పరుగులు తీయలేక కొందరు, ఆర్థిక,వ్యక్తిగత, మానసిక.. ఇలా ఎన్నెన్నో కారణాలతో తనువు చాలిస్తున్నారు. అయితే ఏదైనా బతికి సాధించుకోవాలని గానీ, ఆత్మహత్యతో ఏ ప్రయోజనం లేకపోగా, వారి మీద ఎన్నో ఆశలు పెట్టుకున్న వారి జీవితాలను కూడా అంధకారంలోకి నెడుతుంది.

పరిశోధకుల అధ్యయనం ప్రకారం.. ఎవరైతే తాను ఇక బతకడం వృథా అని పదే పదే ఆత్మహత్య గురించి మాట్లాడతారో, తమకు తామే హాని చేసుకోవడానికి యత్నిస్తారో వారిలో ఆత్మహత్య ఆలోచనలు ఉంటాయి. అటువంటి వారు ఎక్కువగా ఒంటరితనాన్ని ఇష్టపడతారు. ప్రతి సందర్భంలోనూ చికాకుపడటం, ఇతరు లతో మాట్లాడకుండా ఏకాకిగా ఉండడం చేస్తుంటారు. తాము చేసే ప్రతి పనిలోనూ అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిద్రలేమితో బాధ పడతారు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే ఆ వ్యక్తులకు భరోసా అవసరమని మానసిక వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతున్న దాని ప్రకారం 15 %-% 19 సంవత్సరాల వయస్సు గల యువతలో మరణానికి నాలుగో ప్రధాన కారణం ఆత్మహత్య అని తెలుస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 7 లక్షల మందికి పైగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇందులో 77 శాతం కేసులు తక్కువ, మధ్య ఆదాయ దేశాల నుంచి ఉంటున్నాయి. ఇటువంటి ఆత్మహత్యలను నియంత్రించవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. విద్యార్థులకు భరోసాగా ఉండటానికి విద్యాలయాలలో మానసిక నిపుణుల నియమించాలి. విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇప్పించాలి. కొన్ని సమయాల్లో కొన్ని కోర్సులకే డిమాండ్ ఉంటుంది. విద్యార్థులు వేలాది రూపాయలు వెచ్చించి వాటిని నేర్చుకుంటారు. తీరా నేర్చుకున్నాక వాటితో ఉపాధి అవకాశాలు రాకుండా పోతాయి. వివిధ కోర్సులకి సమాన అవకాశాలు ఉండేవిధంగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. విద్యార్థులతో తల్లి తండ్రులు కొంత సమయం గడపాలి. వారి సమస్యలని వినాలి. మార్కులే ప్రామాణికంగా కాకుండా వారికి ఇతర విషయాల్లో కూడా శిక్షణ ఇవ్వాలి. తల్లిదండులు, ఉపాధ్యాయులు, ప్రభుత్వాలు ఉమ్మడిగా ఆత్మహత్యల నివారణకు కృషి చేయాలి.

# కొత్త లేబర్ కోడ్‌లతో మరింత ఖరీదు కానున్న ఫుడ్ డెలివరీ..

**లేబర్ కోడ్‌లతో ఫుడ్ డెలి'వర్రీ'!**

**కేంద్రం తెచ్చిన లేబర్ కోడ్‌లతో ఫుడ్ డెలివరీలు మరింత భారం**

**ఆర్డర్‌కు రూ.2-3 పెరిగే అవకాశం**




**న్యూఢిల్లీ,డిసెంబర్,12 :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కొత్త లేబర్ కోడ్‌ల వల్ల ఫుడ్ డెలివరీ మరింత ఖరీదు కానుంది. గిగ్ వర్కర్ల కోసం కేంద్ర సంక్షేమ నిధికి డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ తమ వార్షిక టర్నోవర్‌లో 1-2 శాతం మేరకు చెల్లించవలసి ఉంటుంది. దీంతో పర్-ఆర్డర్ ఖర్చులు రూ.2-3 వరకు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. జేఎం ఫైనాన్షియల్ తెలిపిన వివరాల ప్రకారం, ఫుడ్ డెలివరీ, క్విక్ కామర్స్ క్యాటగిరీల్లోని కంపెనీలకు ప్రతి ఆర్డర్‌కు దాదాపు రూ.2.10 నుంచి రూ.2.50 వరకు అదనంగా భారం పడుతుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అంచనా ఆర్డర్ వాల్యూమ్స్‌కు దీనిని వర్తింపజేస్తే, ఎటర్నల్ (జొమాటో)కు దాదాపు రూ.430 కోట్లు, స్విగ్గీకి రూ.260 కోట్లు భారం పడుతుంది. ఈ భారాన్ని ఈ కంపెనీలు వినియోగదారులపైనే మోపుతాయి. ఇప్పటికే వినియోగదారులు ప్లాట్‌ఫాం ఫీజు, చిన్న ఆర్డర్ పెనాల్టీలు, పీక్ అవర్ సర్జెస్, సవరించిన జీఎస్‌టీ లెవీస్ వంటి భారాలను మోస్తున్నారు. ఇవి చాలవన్నట్లు ఇకపై ప్రతి ఆర్డర్‌కు రూ.2-3 మేరకు అదనంగా చెల్లించవలసి ఉంటుంది. ఈ విధంగా భారాలు పడటం రెండేళ్లలో ఇది నాలుగోసారి అవుతుంది.

అంతిమంగా వినియోగదారులపైనే భారం: ఎలారా సెక్యూరిటీస్ నిపుణుడు కరణ్ టౌరానీ మాట్లాడుతూ, గిగ్ వర్కర్స్ పేఅవుట్స్‌పై కాంట్రిబ్యూషన్స్ 5 శాతానికి చేరితే, రైడర్ వ్యయాలు చెప్పుకోదగ్గ స్థాయిలో పెరుగుతాయన్నారు. ఎటర్నల్ (జొమాటో) డెలివరీ వ్యయంజీఎంవీలో 9.8 శాతం నుంచి 10.3 శాతానికి పెరుగుతుందన్నారు. స్విగ్గీ డెలివరీ వ్యయం 11.6 శాతం నుంచి 12 శాతానికి పైగా పెరుగుతుందని చెప్పారు. ఇప్పటికే నష్టాలతో సతమతమవుతున్న కంపెనీలకు స్వల్ప జీఎంవీ పెరుగుదల అయినా, ప్రభావం తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ఆర్డర్ వాల్యూస్ పెరిగినప్పటికీ, ధర పట్ల జాగ్రత్త వహించే కస్టమర్లు తక్కువ విలువ గల ఆర్డర్లను ఇవ్వడం మానుకోవచ్చునని నిపుణులు చెప్తున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో స్విగ్గీ రెవెన్యూ54.4 శాతం పెరిగిరూ.5,561కోట్లకు చేరింది, కానీ దాని నికర నష్టం రూ.1,092 కోట్లుగా నమోదైంది. ఎటర్నల్‌కు వచ్చిన రెవెన్యూ రూ.13,590కోట్లు (183 శాతం పెరుగుదల), కాగా నికర లాభం రూ.65 కోట్లకు తగ్గింది. సాంఘిక భద్రత స్మృతి వల్ల గిగ్ వర్కర్లకు బీమా, ఆరోగ్య సంరక్షణ, పదవీ విరమణ ప్రయోజనాలు లభిస్తాయి. అయితే దీనికి సంబంధించిన ఆర్థిక భారాన్ని అంతిమంగా వినియోగదారులే భరించవలసి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు.

# జగన్ కు బ్యాడ్ టైమేనా?



**విజయవాడ,డిసెంబర్,12 :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ పై నమోదయిన కేసుల విషయం చివరి దశకు చేరుకున్నట్లే కనిపిస్తుంది. ఇప్పుడు బీజేపీ కూడా జగన్ కు సాయం చేసే పరిస్థితుల్లో కనిపించడం లేదు. ఆంధ్రప్రదేశ్ లో సొంతంగా అధికారంలో రాకపోయినా దానికి టీడీపీ, జనసేన అండగా ఉంది. అందుకే జగన్ ను నిర్దాక్షిణ్యంగా పక్కన పెట్టే అవకాశాలున్నాయని అనేక మంది సీనియర్ రాజకీయ విశ్లేషకులు కూడా అభిప్రాయపడుతున్నారు. జగన్ వల్ల బీజేపీకి ప్రత్యక్షంగా ప్రయోజనం ఉండదు. అలాగని ఇప్పటి వరకూ నష్టం లేదు. పరోక్షంగా జగన్ తమకు అన్ని రకాలుగా సహకరిస్తున్నాడు. ఆ ఒక్క కారణంతోనే ఇన్నాళ్లు కేసుల విషయంలో చూసీ చూడనట్లు భారతీయ జనతా పార్టీ వ్యవహరించిందంటున్నారు. ఇప్పటి వరకూ ప్రధాని నరంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆశీస్సులు జగన్ కు పుష్కలంగా ఉన్నాయి.

అందుకే ప్రధాని నరేంద్ర మోదీ ఏపీకి ఇన్ని సార్లు వచ్చినా జగన్ ను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. జగన కూడా రాష్ట్రంలో తన ప్రత్యర్థి పార్టీలు బీజేపీతో జత కట్టినా బీజేపీని ఒక్క మాట అనడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వానికి ఏం అవసరమొచ్చినా కమలం పక్కనే నిలబడుతున్నారు. కాంగ్రెస్ తనకు ప్రధాన శత్రువు కావడంతో బీజేపీకి మద్దతు ఇస్తుండవచ్చు. అందుకే ఏ బిల్లు విషయంలోనైనా,రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి ఎన్నికల్లోనైనా జగన్ నేరుగానే మద్దతిచ్చి మోదీ కి ఇష్టమైన వ్యక్తిగా మారాడు. అలాగే బీజేపీ విషయంలో ఒక్క విమర్శ కూడా చేయకుండా జాగ్రత్త పడుతున్నారు.

కానీ బీజేపీ తన వైఖరి మార్చుకోవడానికి అనేక కారణాలుంటాయి. బీజేపీకి కూడా దక్షిణాదిన అందులో ఆంధ్రప్రదేశ్ లో తమ బలం పెంచుకోవడం అవసరం. అది జగన్ వల్ల సాధ్యం కాదు. కూటమితో ఉంటే సీట్ల సంఖ్య పెంచుకోవచ్చు. అధికారంలో ఒక రాష్ట్రంలో ఉన్నామన్న సంతృప్తి పొందవచ్చు.

కానీ జగన్ వల్ల రాజకీయ ప్రయోజనం కొన్నింటికే పరిమిమై ఉంటుంది. ఈ విషయం గ్రహించిన బీజేపీ తన పంథాను మార్చుకోవచ్చన్న సూచనలు బలంగా అందుతున్నాయి. తమకు జగన్ కంటే రాజకీయ ప్రయోజనాలు ముఖ్యమని భావిస్తే జగన్ కు రానున్న కాలంలో కష్టాలు తప్పవన్న సంకేతాలు ఇప్పటికే వస్తున్నాయి. జగన్ నేడు సీబీఐ కోర్టుకు కొన్నేళ్ల తర్వాత హాజరవ్వడాన్ని కూడా ఈ కోణంలోనే చూడాల్సి ఉంటుంది. అందుకే జగన్ కు రానున్నకాలం కష్టకాలమేనని ఖచ్చితంగా చెప్పొచ్చు.

# ఆరేండ్ల బాలుడిపై పెంపుడు కుక్క దాడి..

## తెగిపడిన చెవి.. యజమాని అరెస్ట్



**న్యూఢిల్లీ,డిసెంబర్,12 :** దేశ రాజధాని ఢిల్లీలో ఓ బాలుడిపై పెంపుడు కుక్క దాడి చేసింది. ఆ పిల్లాడిని దానిని తప్పించేందుకు స్థానికులు ప్రయత్నించి నప్పటికీ.. అతని చెవి తెగిపోయేదాక అది వదల్లేదు. సాయంత్రం 5.38 గంటల సమయంలో ప్రేమ్‌నగర్ ప్రాంతంలోని విజయ్ ఎన్‌క్లేవ్‌లోని తన ఇంటి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఇంతలో రాజేశ్ పాల్(50) అనే టైలర్‌కు చెందిన పిట్‌బుల్ జాతి కుక్క అకస్మాత్తుగా ఇంటి నుంచి బయటకు వచ్చింది. అక్కడే అక్కడున్న బాలుడిపై దాడి చేయబోయింది. పిల్లవాడు దాని బారి నుంచి తప్పించుకుని పరుగుతీస్తుండగా వెంటాడిన కుక్క అతనిపై ఎగబడింది. ఓ మహిళ దానిని ఆపడానికి ప్రయత్నించినప్పటికీ అది ఆగలేదు. అక్కడే ఉన్న మరో వ్యక్తి దానిని గమనించిన ఆ బాలుణ్ని రక్షించబోయారు. అయినప్పటికీ బాలుడిని వదలని శునకం.. అతని కుడి చెవి తెగిపోయేలా కరిచింది. కుక్క దాడిలో తీవ్రంగా గాయపడిన బాలుణ్ని వెంటనే స్థానికంగా ఉన్న రోహిణిలోని బీఎస్ఏ హాస్పిటల్‌కి, అక్కడి నుంచి సఫ్దర్‌జంగ్ దవాఖానకు తరలించారు.

ఇదంతా అక్కడే ఉన్న సీసీటీవీ కెమెరాలో రికార్డయింది. కాగా, బాలుడి తండ్రి ఫిర్యాదు మేరకు కుక్క యజమాని రాజేశ్‌పాల్‌పై భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద కేసుపెట్టిన పోలీసులు.. హత్యాయత్నం కింద అతడిని అరెస్టు చేశారు. రాజేశ్ పాల్ కుమారుడు సచిన్ పాల్.. సుమారు ఏడాదిన్నర క్రితం ఆ శునకాన్ని పెంచుకునేందుకు ఇంటికి తెచ్చినట్టు సమాచారం. ప్రస్తుతం అతడు ఓ హత్యా నేరంపై జైలులో ఉన్నాడు. కాగా, కుక్క తన యజమాని చేతి నుంచి విడిపించుకుని ఈ దారుణానికి పాల్పడిందని బాలుడి తాత కామేశ్వర్ రాయ్ చెప్పారు. అతని తల వెనుక భాగంలో ఎనిమిది నుంచి పది కుక్కకాట్లు పడ్డాయన్నారు.

# చంద్రుడికి జన్మనిచ్చి మరణించిన థియా!



**హైదరాబాద్,డిసెంబర్,12 :**భూమి, చంద్రుడి ఉద్భవానికి విశ్వంలో జరిగిన భారీ విస్ఫోటమే కారణమని ఇప్పటివరకూ చదువుకొన్నాం. 4.5 బిలియన్ సంవత్సరాల కిందట రెండు పెద్ద గ్రహాలు ప్రొటో ఎర్త్ (భూమి ఏర్పడటానికి ముందు గ్రహం), థియా పరస్పరం ఢీకొనడంతో ఇది జరిగినట్టు శాస్త్రవేత్తలు చెబుతూ వచ్చారు. అయితే, ఢీకొన్న అనంతరం చంద్రుడు, ప్రస్తుత భూమి ఏర్పడగా అంగారకుడి పరిమాణంలో ఉండే థియా ఏమైందన్న ప్రశ్నలకూ ఇంతవరకూ సమాధానం లేదు. అయితే, జర్మనీలోని మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సోలార్ సిస్టమ్ రిసెర్చ్, యూనివర్సిటీ ఆఫ్ షికాగో పరిశోధకులు తాజాగా దీనిపై కొత్త థియరీని తెరమీదకు తీసుకొచ్చారు. ప్రొటో ఎర్త్‌తో థియా ఢీకొన్న తర్వాత చంద్రుడు ఉద్భవించాడని, అనంతరం భూమిలోనే థియా కలిసిపోయిందని శాస్త్రవేత్తలు అంచనాకు వచ్చారు. భూమితో పాటు చంద్రుడి గర్భంలో దొరికిన ఐసోటోప్‌లను విశ్లేషించగా ఇది తెలిసివచ్చినట్టు పేర్కొన్నారు.

# కార్పొరేట్ల కోసమే లేబర్ కోడ్స్




కేంద్ర బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్స్‌గా మార్చింది. 2019లో వేతనకోడ్‌ను, 2020లో పారిశ్రామిక సంబంధాల కోడ్, సామాజిక భద్రతా కోడ్, వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్‌లకు పార్లమెంట్లో ఆమోదం పొందింది. అయినా, గత ఐదేళ్ల నుంచి వాటిని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వానికి ధైర్యం చాలలేదు. బీహార్‌లో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వెంటనే లేబర్ కోడ్స్ అమలు చేసే నాలుగు జీఓలను కేంద్ర కార్మిక శాఖా మంత్రి మాన్‌సూఖ్ మాండివ్య ప్రకటించారు. ఈ లేబర్‌కోడ్‌లు కార్పొరేట్లకు అనుకూలం. కార్మికవర్గానికి వ్యతిరేకం.

కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర బీజేపీ ప్రభుత్వం లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చింది. ప్రధాని మోడీ లేబర్‌కోడ్‌ల అమలు ఉత్తర్వులను సరళీక రణ విధానాలు అమల్లో భాగంగా అభివర్ణించారు. 'క్రోని కాపిటలిజం' కాలంలో కార్పొరేట్ల అత్యధిక లాభాలు గడించడానికి ప్రస్తుత చట్టాలు ఆటంకంగా ఉన్నాయి. అందుకోసమే ప్రస్తుత 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్‌లుగా కుదించి, అమల్లోకి తెచ్చారు. వాస్తవానికి పాలకవర్గం తమ దయా దాక్షిణ్యాలతో ఏ కార్మిక చట్టాన్ని రూపొందించలేదు. ప్రతి కార్మిక చట్టం వెనుక మహత్తరమైన పోరాటాలు ఉన్నాయి. అశేష త్యాగాల కారణంగా వచ్చిన కార్మిక చట్టాలను చెరుకు బండి రసాన్ని తీసినట్లు సారాన్ని పూర్తిగా తొలగించి, పిప్పినే మిగిల్చారు ఇప్పుడు. కార్మికవర్గం లేబర్‌కోడ్‌ల ద్వారా ఉన్న హక్కులను కోల్పోయింది. ఉన్న ఫళంగా పనిగంటలు పెంచితే కార్మిక వర్గం సహించి ఊరుకోదు. ఐక్యంగా పోరాడి తిరిగి చట్టాలను సాధించుకుంటుంది. రానున్న కాలంలో ప్రతిఘటన, పోరాటాలు అనివార్యం. లేబర్‌కోడ్‌ల పేరుతో నిర్వచనాలకే తిలోదకాలిచ్చారు. 'చట్టం' అనే పేరు లేకుండా కోడ్‌గా మార్చారు. ఇన్‌స్పెక్టర్ బదులుగా ఫెలిసిటేటర్ అని రూపాంతరం చేశారు. తనిఖీలు ఉండరాదనే కార్పొరేట్‌ల కోర్కెను ఈ విధంగా తీర్చారు. తనిఖీ లేకుండా ఏ చట్టమైనా అమలు జరుగుతుందా? కార్మిక చట్టాల్లోని జీతం, డీఏ, బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ వగైరా ఏ ఒక్క అంశం అమలు జరగకపోయినా- అధికారులు తనిఖీ చేయాలి. ఇది ఇప్పటివరకూ చట్టాలు చేసే మార్గదర్శనం. కాని ఇకముందు యూనియన్లు ఫిర్యాదు చేసినా, కార్మికులు ఫిర్యాదు చేసినా ఎలాంటి తనిఖీలూ ఉండవు. ఇప్పటివరకూ చట్టాలు అమలు చేయకపోతే యజమానికి జైలుశిక్షలు విధించే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇకముందు జరిమానాలే గాని జైలు శిక్షలుండవు. అంటే ఏ యజమానికి ఏ భయమూ ఉండదు. ఫలితంగా లేబర్‌కోడ్‌లో ఉన్న అంశాలు కూడా అమలు కావు. ఇప్పటి వరకూ ఉన్న 'ట్రైనీ' అనే పదం కూడా మాయమైంది. దానికి బదులు ఫిక్స్‌డ్‌టర్మ్ ఎంప్లాయిమెంట్ పేరుతో ఎన్ని సంవత్సరాలైనా పర్మినెంట్ చేయకుండా పని చేయించుకునే విధానం అమల్లోకి వస్తుంది. పేరు ఏది పెట్టినా కార్మికులను జీవితమంతా పర్మినెంట్ చేయకుండా పని చేయించడమే లేబర్‌కోడ్స్ సారాంశం. ఇప్పటికే అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం లాంటి అనేక తరగతులను కార్మికులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. సామాజిక భద్రత, వృత్తిపర భద్రత కోడ్‌ల పేరుతో కార్మికులందరికీ భద్రత కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం చెప్పడం పచ్చి మోసం. బిల్డింగ్, మైన్స్, బీడీ కార్మికులు, జర్నలిస్టులతో సహా ఇన్నేళ్లూ పోరాడి సాధించుకున్న భద్రతను ఈ కోడ్స్ కారణంగా కోల్పోతున్నారు. 1996లో వచ్చిన బిల్డింగ్ వర్కర్స్ చట్టం ప్రకారం%ౌ% భవనాలు, ఇతర నిర్మాణాల యజమానుల నుంచి వసూలు చేసిన సెస్‌ను ఆ రంగాల కార్మికులకు ఖర్చు పెట్టాలి. కానీ, ఇప్పుడు వృత్తిపరమైన రంగాల చట్టాలన్నీ రద్దయిపోతాయి. యజమానుల నుంచి సెస్ వసూలు చేయకుండా వారికి భద్రత ఉండదు. దీనివల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుంది. కార్మికులు సమ్మె చేయకుండా అన్ని విధాల ప్రభుత్వానికి, యాజమాన్యాలకు పారిశ్రామిక సంబంధాల కోడ్ అవకాశం కల్పిస్తుంది. సమ్మె కార్మికుల హక్కు. కార్మికులు పోరాడకుండా ఏ హక్కులూ సాధించుకోలేం. కానీ పారిశ్రామిక సంబంధాల కోడ్‌లో పేర్కొన్న దాని ప్రకారం%ౌ% కార్మికులు సమ్మె చేస్తే - ఒక రోజు సమ్మెకు 8 రోజుల జీతం కట్ అవుతుంది. రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయవచ్చు. అంటే రానున్న కాలంలో పోరాటాలను అణచాలనే పాలకవర్గాల కుట్రలో భాగమే లేబర్‌కోడ్స్ అమలు. "అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న" అన్నట్లు కేంద్ర ప్రభుత్వం లేబర్‌కోడ్‌లు అమల్లోకి రాకముందే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అనేక కార్మిక చట్టాలను అమలు చేయడం లేదు. దీనినే దేశమంతా 'ఈజ్ ఆఫ్ డూయింగ్' బదులు 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అనే నినాదంతో కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్నారు.

# సూరయ్యపల్లిలో రైతునేస్తం నిర్వహించిన వ్యవసాయ అధికారులు





**మంథని,డిసెంబర్,12:** మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలోని రైతు వేదిక లో ౦ంతు నేస్తం కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా గురించి అందరికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయ సాగు పరిస్థితులకు అనుగుణంగా భారత ప్రభుత్వం నూతన విత్తన చట్టం 2025 ముసాయిదా ప్రతిపాదించడం జరిగిందన్నారు. ఈ ప్రతిపాదిత చట్టం ద్వారా నాణ్యమైన విత్తనాలు మరియు నర్సరీ మొక్కలు యొక్క నాణ్యతను సరైన విధంగా నియంత్రించాలని ఉద్దేశంతో ముఖ్యంగా రైతులకి నాణ్యమైన విత్తనాలను పెద్ద ఎత్తున అందించాలనే కారణలతో నాణ్యత లోపం, నకిలీ విత్తనాలను పూర్తిగా అరికట్టాలని, విత్తనాల దిగుమతిని కూడా సరళీకరించడానికి రైతు హక్కులని పూర్తిగా పరిరక్షించాలనే ఉదేశ్యంతో ఈ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని అన్నారు.ఈ ప్రత్తిపాదిత చట్టంలో మొత్తం పది అధ్యాయాలు మరియు 48 విభాగాలు ఉన్నాయన్నారు. ప్రతి రకం యొక్క విత్తనం మార్కెటింగ్ మరియు రైతులకు అమ్మే ముందు తప్పనిసరిగా నమోదు చేయాలని,దీనికై జాతీయస్థాయిలో ఒక జాతీయ విత్తన నమోదు రిజిస్టర్ ను ఏర్పాటు చేసి ప్రతి ఆరు నెలల నుంచి సంవత్సరంలోపు నమోదు కాబడిన రకాల జాబితా సమాచారాన్ని రైతులకు అందుబాటులో తీసుకోని రావడం జరుగుతుందన్నారు. ఈ చట్టం అమల్లోకి వచ్చే సమయానికి అప్పటికే సాగులో ఉన్న రకాల విత్తనాలు ఒకవేళ నమోదు కాకపోతే ఒక ఆరు నెలల సమయం ఇచ్చి ఆ రకాలు యొక్క పూర్తి సమాచారాన్ని నమోదు చేసుకోవడానికి పొందు పర్చాలన్నారు. ఏదైనా విత్తన సంస్థ ఒక రకం యొక్క విత్తనాలను ఉత్పత్తి చేసి మార్కెట్లో అమ్మదలిచినప్పుడు ఆ రకం యొక్క విత్తనాల సమాచారాన్ని జాతీయ రిజిస్టర్లలో నమోదు కాబడాలి. లేనిచో ఆ విత్తనము అమ్మడానికిహౌఅర్హతహౌఉండదన్నారు.భారత ప్రభుత్వంచే నోటిపై కాబడిన రకాల విత్తనాలకు ఎలాంటి నమోదు ప్రక్రియ అవసరం లేదన్నారు.ఏదైనా రకం యొక్క విత్తనాలని నమోదు చేసుకోదల్చినప్పుడు ఆ రకం యొక్క విత్తనాల్ని ముందుగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన స్థానాల్లో పరీక్షించబడి ఆ రకం యొక్క గుణగణాలు, దిగుబడి సామర్థ్యం పై తగు సమాచారము తీసుకొని నమోదు ఉప కమిటీకి ఈ సమాచారాన్ని ఇవ్వవలసి ఉంటుందన్నారు. ఒక రకం యొక్క విత్తనాలని అమ్మే ముందు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, ఆ విత్తనాలు నిబంధనలకు అనుగుణంగా భారత విత్తన ధ్రువీకరణ గుణగణాలు కలిగి ఉండి,విత్తన సంచి పై పూర్తి సమాచారం విత్తనం యొక్క పుట్టుక గురించి కనిపెట్టగలిగే క్యూఆర్ కోడ్ ద్వారా పొందుపరచాలన్నారు. ఈ చట్టంలో ఒక విత్తన సంస్థ ద్వారా ఉత్పత్తి చేయబడ్డ విత్తనాల యొక్క సమాచారాన్ని పూర్తిగా ఉంచకపోవడం, లక్ష రూపాయలు జరిమానా విధించబడుతుందని తెలిపారు. తప్పుడు బ్రాండ్ పెట్టి నాసిరకం విత్తనాలు అధిక ధరలకి అమ్మడము ట్రేసబులిటీపై సమాచారం ఇవ్వకపోవడం వంటి పరిస్థితుల్లో 10 లక్షల రూపాయల వరకు జరిమానా విధించబడుతుందన్నారు. నకిలీ విత్తనాలు, విత్తన రకాలను నమోదు చేయకుండా విత్తనాలు మార్కెట్ చేసినప్పుడు 10 నుండి 20 లక్షల రూపాయలు జరిమానా మరియు మూడేళ్ల జైలు శిక్ష లేదా రెండు విధించబడేలా ఈ చట్టంలో నిబంధనలు పొందుపరచడంహౌజరిగిందని తుమ్మల నాగేశ్వరరావు వివరించారు . ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ , ఎఎంసి చైర్మన్ కుదుదుల వెంకన్న, విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు శశి భూషణ్ కాచే ,మాజీ ఏఎంసీ చైర్మన్ అజీమ్ ఖాన్, పెద్దపల్లి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ముసుకుల సురేందర్ రెడ్డి ,మంథని సహాయ వ్యవసాయ సంచాలకులు అంజనీ మిశ్రా, దాసరి నవ్య, మంథని మండల వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏకంగా.. ఎకరం రూ. 137.25 కోట్లు




**హైదరాబాద్,డిసెంబర్,12 :** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం బలంగా ఉందని నిరూపిస్తూ.. కోకాపేట నియోపోలిస్ భూముల వేలంలో రికార్డు ధరలు పలికాయి. హెచ్ఎండీఏ నిర్వహించిన ఈ వేలంలో ఎకరం భూమి అత్యధికంగా రూ. 137.25 కోట్లు పలికింది. ఔటర్ రింగ్ రోడ్డు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, అంతర్జాతీయ విమానాశ్రయానికి దగ్గరగా ఉండటం, అత్యాధునిక మౌలిక వసతులు, ఎన్ని ఫ్లోర్లయినా నిర్మించుకునే స్వేచ్ఛ వంటి కారణాల వల్ల ఈ ధరలు పెరిగాయి. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో.. ముఖ్యంగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం ఎంత వేగంగా దూసుకుపోతుందో చెప్పడానికి కోకాపేట నియోపోలిస్ లేఅవుట్‌లో జరిగిన తాజా భూముల వేలం ఒక చక్కని ఉదాహరణ. ఇటీవలి కాలంలో భూముల ధరలు రికార్డు స్థాయిని దాటి.. అంచనాలకు అందని విధంగా అమ్ముడుపోతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) నిర్వహించిన ఈ వేలంలో ఎకరం భూమి అత్యధికంగా రూ. 137.25 కోట్లు పలకడం రియల్ ఎస్టేట్ రంగం బలాన్ని సూచిస్తోంది. సాధారణంగా భూముల ధరలను పెంచే అంశాల్లో.. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి సదుపాయాలు మెరుగ్గా ఉండటం.. ప్రముఖ ఐటీ కేంద్రాలు, ఆర్థిక జిల్లాలు (ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్) , పారిశ్రామిక ప్రాంతాలకు దగ్గరగా ఉండటం.. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే విధానాలు ఉన్నాయి. ఈ మూడు అంశాలు హైదరాబాద్ చుట్టూ ఉన్న ప్రాంతాల్లో బలంగా ఉన్నాయి. ముఖ్యంగా రాయదుర్గం, కోకాపేట వంటి ప్రాంతాలు ఐటీ హబ్‌లకు దగ్గరగా ఉండటం వల్ల భూముల విలువ ఊహించని విధంగా పెరుగుతోంది.ఇటీవల రాయదుర్గంలో జరిగిన మరో వేలంలో ఎకరం భూమి కనీస ధర రూ. 101 కోట్లుగా నిర్ణయిస్తే.. వేలంలో అది రూ. 177 కోట్లు పలికింది. ఈ పరిస్థితి రాష్ట్ర రాజధాని ప్రాంతంలో భూముల కోసం సంస్థలు ఎంత పోటీ పడుతున్నాయో స్పష్టం చేస్తోంది. కోకాపేటలోని నియోపోలిస్ లేఅవుట్ ప్రాంతంలో భూములు రికార్డు ధర పలకడానికి బలమైన కారణాలు ఉన్నాయి. వాటిలో.. గ్లోబల్ స్టాండర్డ్స్ ఒకటి. హెచ్ఎండీఏ ఈ లేఅవుట్‌ను సుమారు రూ. 300 కోట్ల వ్యయంతో అత్యున్నత ప్రమాణాలతో అభివృద్ధి చేసింది. 45 మీటర్ల వెడల్పైన రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలు, ప్రత్యేక సైక్లింగ్ ట్రాక్‌లు వంటి అత్యాధునిక మౌలిక వసతులను కల్పించారు.ఇక్కడ ప్లాట్లను కొనుగోలు చేసిన వారికి ఆకాశమే హద్దుగా భవనాలను నిర్మించుకోవడానికి అనుమతులు ఇస్తున్నారు. దీనివల్ల బహుళ అంతస్తుల వాణిజ్య భవనాలు, నివాస సముదాయాలు నిర్మించేందుకు అంతర్జాతీయ సంస్థలు ఆసక్తి చూపుతాయి. కోకాపేట ప్రాంతం ఒకవైపు 'ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)'కు కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఉంది. దీంతో నగరం చుట్టూ ఎక్కడికైనా త్వరగా చేరుకోవచ్చు. మరోవైపు రాయదుర్గం ఐటీ కంపెనీలు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కు చాలా దగ్గరగా ఉంది.మరో అంశం.. విమానాశ్రయానికి అనుసంధానం. అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం 20 నిమిషాల్లో చేరుకునే సౌకర్యం ఉండటం వలన.. దేశ విదేశీ బడా కంపెనీలు తమ కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నాయి. ఈ అన్ని కారణాల వల్ల కోకాపేట నియోపోలిస్ ప్లాట్‌లకు రికార్డు ధరలు పలికాయి. సర్వే నంబర్ 18 లోని 5.31 ఎకరాల భూమికి ఎకరానికి రూ. 137.25 కోట్ల ధర పలికింది.

# భారత్‌కు మాస్కో బంపరాఫర్



**న్యూఢిల్లీ,డిసెంబర్,12 :** ఇండియాకు ముడి చమురు ఎగుమతి చేస్తున్న రష్యా కంపెనీల మీద అమెరికా.. తన అక్కసు వెళ్లగక్కడమే కాక ఆంక్షలువిధించిన సంగతి తెలిసిందే. అమెరికా చర్యల వల్ల ఇండియాకు ముడి చమురు దిగుమతులు భారీగా తగ్గుతాయనే ఆందోళన వ్యక్తం అవుతోన్న నేపథ్యంలో.. మాస్కో ఇండియాకు బంపరాఫర్ ప్రకటించింది. ముడి చమురు దిగుమతుల మీద రెండేళ్లలో ఎన్నడు లేనంత రీతిలో భారీ స్థాయిలో డిస్కౌంట్ ప్రకటించింది. బ్యారెల్ మీద 7 డాలర్ల డిస్కౌంట్ ప్రకటిస్తూ రష్యా నిర్ణయం తీసుకుంది. భారత్ రష్యా నుంచి అత్యధికంగా చమురు దిగుమతి చేసుకుంటున్న సంగతి తెలిసిందే. దీనిపై అక్కసు వెళ్లగక్కుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. కొద్ది రోజుల క్రితం సంచలన ప్రకటన చేశారు. రష్యా చమురు కంపెనీలపైన రాస్‌నెఫ్ట్, లుకోయిల్ సంస్థలతో పాటు వాటి అనుబంధ కంపెనీలపై డొనాల్డ్ ట్రంప్ ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. దీంతో ఈ సంస్థలతో భాగస్వామ్యం కలిగిన కంపెనీలపై తీవ్ర ప్రభావం పడనుంది. అలానే సమీప భవిష్యత్తులో భారత్‌కు ముడి చ దిగుమతులు మరింత పడిపోవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఆంక్షల నేపథ్యంలో రష్యా భారత్‌కు బంపరాఫర్ ప్రకటించిది. రెండేళ్లలో ఎన్నడు లేనంత తక్కువ ధరలకే.. ఇండియాకు ముడి చమరురును అందించేందుకు మాస్కో రెడి అయ్యిందిఈక్రమంలో రష్యా కీలక ప్రకటన చేసింది. ఇండియా రిఫైనర్లకు యూరల్స్ ధర డెలివరీ ప్రాతిపదికన.. డేటెడ్ బ్రెంట్‌తో పోలిస్తే.. బ్యారెల్ మీద సుమారు 7 డాలర్లు వరకు తగ్గింపు ప్రకటించింది. అయితే ఈ ఆఫర్ ఇప్పటి నుంచి వర్తించదు. డిసెంబరులో లోడ్ చేసి.. 2026, జనవరిలో ఇండియాకు చేరే కార్గోల మీద ఈ డిస్కౌంట్ ఆఫర్ వర్తించనుంది. అమెరికా ఆంక్షలు విధించడానికి ముందు యురల్స్.. ఒక్క బ్యారెల్ మీద సుమారు మూడు డాలర్ల వరకు డిస్కౌంట్ ఆఫర్ ఇచ్చింది. ఇప్పుడు దీన్ని ఏడు డాలర్లకు పెంచడం మరింత శుభపరిణామం అంటున్నారు.రోస్‌నెఫ్ట్, లుకోయిల్ సంస్థలపై అమెరికా విధించిన ఆంక్షలు అమలులోకి రావడంతో.. భారత రిఫైనర్లు రష్యన్ సంస్థల వద్ద నుంచి చమురు ఆర్డర్లను భారీగా తగ్గించాయి. 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడి తర్వాత నుంచి ఇండియా.. మాస్కో నుంచి చౌకైన చమురును విస్తృతంగా దిగుమతి చేసుకుంది. కానీ అమెరికా ఆంక్షల కారణంగా ఇప్పుడు దిగుమతి నిలిపి వేసింది.రోస్‌నెఫ్ట్, లుకోయిల్ సంస్థల మీద మాత్రమే కాక గాజ్‌ప్రోమ్ నెఫ్ట్, సుర్గుట్‌నెఫ్టెగాస్ కంపెనీల మీద అమెరికా ఆంక్షలు విధించింది. ఈక్రమంలో ఇండియా రిఫైనర్లు.. ప్రస్తుతం రష్యా వద్ద నుంచి కాక.. మధ్యప్రాచ్యం సహా ఇతర ప్రాంతాల నుంచి భారీ పరిమాణంలో ముడి చమురును కొనుగోలు చేస్తున్నాయి. రష్యా చమురు ధరల మీద భారీ స్థాయిలో డిస్కౌంట్ ప్రకటించడం వల్ల భారత్‌కు తాత్కాలికంగా లాభం కలిగించవచ్చు. కానీ రష్యా కంపెనీల మీద అమెరికా ఆంక్షల కారణంగా సరఫరా స్థిరత్వం అనిశ్చితంగా మారింది. రిఫైనర్లు తక్కువ ధరల వల్ల రష్యన్ చమురును కొనుగోలు చేయడానికి రెడీ అవుతున్నప్పటికీ.. దీర్ఘకాలంలో.. అమెరికా ఆంక్షలు దీన్ని మరింత క్లిష్టతరం చేస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కనుక ఈ డిస్కౌంట్ ఆఫర్ వల్ల ఇండియాకు పెద్దగా లాభం ఉండబోదని అభిప్రాయపడుతున్నారు.


# మిల్లెట్ ఉత్పత్తిల వినియోగంతో ఆరోగ్యం



**జయశంకర్ భూపాలపల్లి,డిసెంబర్,12:** మిల్లెట్ ఉత్పత్తుల వినియోగం వల్ల ఆరోగ్యంతో పాటు మహిళ సంఘాలకు ఆర్థికంగా బలోపేతం అవుతాయని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. చెల్పూర్ మిల్లెట్ యూనిట్ నిర్వహిస్తున్న మహిళలకు మిల్లెట్ ఆహార పదార్థాల విక్రయాల కోసం ఐడిఓసి కార్యాలయం ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసిన స్టాల్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిల్లెట్ ఆహార పదార్థాలు వినియోగం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మిల్లెట్ ఉత్పత్తుల విక్రయాలను విస్తృతం చేసి ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని సూచించారు. ప్రజల్లో మిల్లెట్ ఆహారాల వినియోగం పెరిగేలా అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మిల్లెట్ ఆహార ఉత్పత్తులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉందని, ఈ అవకాశాన్ని మహిళా సంఘ సభ్యులు సద్వినియోగం చేసుకొని తమ వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబనకు నిరంతరం తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిఆర్డీఓ బాల కృష్ణ, చెల్పూర్ మిల్లెట్ యూనిట్ నిర్వహణ సంగ సభ్యులు రజిత తదితరులు పాల్గొన్నారు.

# జనవరి, ఫిబ్రవరిలో పలు రైళ్లు రద్దు, దారి మళ్లింపు..!

**కాజీపేట,డిసెంబర్,12:** రైల్వేశాఖ సికింద్రాబాద్ రైల్వే డివిజన్ పరిధిలోని కాజీపేట రైల్వే జంక్షన్ బలార్షా సెక్షన్లో వచ్చే ఏడాది (2026) జనవరి, ఫిబ్రవరి రెండు నెలలలో 22న రోజుల పాటు అన్ని ప్రయాణికుల రైళ్లను రద్దు, దారి మళ్లించి నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. సెక్షన్‌లోని మందమర్రి రైల్వేస్టేషన్లో జరగను న్న మూడో లైన్ నాన్ ఇంటర్ లాకింగ్ పనుల కారణంగా జనవరి 24 నుంచి ఫిబ్రవరి 14 వరకు 22 రోజులపాటు కాజీపేట రైల్వే జంక్షన్ బలార్షా సెక్షన్ లో ప్రతిరోజు, రెండు మూడు రోజులకు ఒకసారి నడిచే (వారాంతరపు) పలు ప్రయాణికుల రైళ్ల రాకపోకలను రద్దు చేయనున్నారు. సుదూర ప్రాంతాలైన తిరువనంతపురం, కన్యాకుమారి, బెంగళూరు, యశ్వంత పూర్, హుబ్లీ, చెన్నై, కలకత్తా, ముంబై, న్యూఢిల్లీ, జమ్ముతావి, బిలాస్‌పూర్, వారణాసి, దానాపూర్ తదితర ముఖ్య రైల్వే కేంద్రాల నుంచి నడిచే పలు రైళ్లను కాజీపేట, సికింద్రాబాద్, నిజాంబాద్, అకోలా, ఇటార్సీ,



నాగపూర్ తదితర రైల్వే స్టేషన్ల మీదుగా దారి మళ్ళించి నడపనున్నారు. ఈసెక్షన్ మీదుగా ఈ తేదీలలో రైల్వే శాఖ రద్దు పరిచిన, దారి మళ్లించిన పలు రైళ్ల వివరాలు, విషయంను ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

# గ్రహాంతర వాసుల గుట్టు విప్పే భారీ టెలిస్కోప్


**- భారత దేశ భాగస్వామ్యంతో జపాన్ నిర్మాణం**
**- 30 మీటర్ల ప్రైమరీ మిర్రర్ సహా మొత్తం 500 ల మిర్రర్లతో ఏర్పాటు**
**- విశ్వ రహస్యాలపై పరిశోధనలో సరికొత్త ముందడుగు**

**ఢిల్లీ,డిసెంబర్,12 :** సువిశాల విశ్వంలో మనకు తెలియని వింతలు,విశేషాలు ఎన్నో ఉన్నాయని, సౌర కుటుంబం ఆవల జీవం ఉనికి ఉండే అవకాశం ఉందని ఖగోళ శాస్త్రవేత్తల అభిప్రాయం. విశ్వంలోని ఈ రహస్యాల గుట్టు విప్పేందుకు నిరంతరం పరిశోధనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఎప్పటికప్పుడు టెక్నాలజీని జోడిస్తూ శోధన చేస్తూనే ఉన్నారు. గ్రహాంతర వాసుల ఉనికిని గుర్తించేందుకు జరుగుతున్న పరిశోధనల్లో జపాన్ తాజాగా సరికొత్త టెలిస్కోప్ నిర్మాణం తలపెట్టింది.

థర్టీ మీటర్ టెలిస్కోప్ (టీఎంటీ) పేరుతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో భారత దేశానికీ భాగస్వామ్యం ఉంది. ప్రపంచంలోనే అత్యంత భారీ టెలిస్కోప్ ల సరసన చోటు సంపాదించుకునేలా నిర్మించాలని ప్రయత్నిస్తోంది. ఈ టెలిస్కోప్ తో గ్రహాంతరవాసులు ఉన్నారా అనే ప్రశ్నకు సమాధానం కనుగొనేందుకు ఇరు దేశాలు పరిశోధనలు ప్రారంభించాయి.

40 ఏళ్ల క్రితం అంతరిక్షంలోకి రేడియో సిగ్నల్స్..: జపాన్ ఖగోళ శాస్త్రవేత్తలు 40 సంవత్సరాల క్రితం అంతరిక్షంలోకి రేడియో సిగ్నల్స్ పంపించారు. వాటికి ప్రతిస్పందనను గుర్తించేందుకు తాజాగా ఈ టెలిస్కోప్ తో ప్రయత్నిస్తున్నారు. జపాన్‌లోని హ్యోగో యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్త షిన్యా నరుసావా నేతృత్వంలోని బృందం గ్రహాంతరవాసుల నుంచి వచ్చే ప్రతిస్పందనను వినడానికి సిద్ధమవుతోంది. 1983 ఆగస్టు 15న ప్రొఫెసర్లు మసాకి మోరిమోటో, హిసాషి హిరబయాషిలు స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం యొక్క యాంటెన్నాను ఉపయోగించి భూమి చరిత్ర మరియు మానవ రూపం గురించి 13 చిత్రాలతో కూడిన రేడియో సిగ్నల్స్‌ను అంతరిక్షంలోకి పంపారు. ఆ సందేశం పంపిన నక్షత్ర వ్యవస్థకు సుమారు 40 సంవత్సరాలలో చేరుతుందని వారు అంచనా వేశారు.

థర్టీ మీటర్ టెలిస్కోప్ : ప్రపంచంలోని అత్యంత పెద్ద ఆప్టికల్ మరియు ఇన్‌ఫ్రారెడ్ టెలిస్కోప్‌లలో థర్టీ మీటర్ టెలిస్కోప్ ఒకటి. ఇది విశ్వం



యొక్క లోతైన రహస్యాలను ఛేదించడానికి, సుదూర నక్షత్రాలు, గెలాక్సీలు మరియు ఎక్సోప్లానెట్‌లను అధ్యయనం చేయడానికి ఉద్దేశించి నిర్మిస్తున్నారు. దీని ప్రైమరీ మిర్రర్ 30 మీటర్ల వ్యాసం కలిగి ఉంటుంది. ఇది 492 చిన్న, హెక్సాగోనల్ అద్దం భాగాలను కలిపి ఒకే ఉపరితలంగా పనిచేసేలా రూపొందించనున్నారు.

# స్నేహిత కార్యక్రమం విద్యార్థులకు ఆత్మస్థైర్యాన్ని నింపుతుంది

## డాక్టర్ వెంకటరమణ డీఎంహెచ్ఓ

**జమ్మికుంట,డిసెంబర్,12 :** జిల్లా కలెక్టర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్నేహిత కార్యక్రమం పేజ్ 2 కార్యక్రమం జమ్మికుంట పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ) లో వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరుణ ఆధ్వర్యంలో స్నేహిత కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ, డిప్యూటీ డి ఎం హెచ్ ఓడాక్టర్ చందు,తో కలిసి హాజరయ్యారు ,ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి విద్యార్థులతో మాట్లాడుతూ స్నేహిత కార్యక్రమం,అనేది విద్యార్థులను ముఖ్యంగా బాలికలను శక్తివంతం చేయడానికి మరియు రక్షించడానికి ఫోక్సో వంటి చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశమని, విద్యార్థులు తమను తాము రక్షించుకోవడానికి ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని, మంచి స్పర్శ మరియు చెడుస్పర్శ, పట్ల అవగాహన కలిగి ఉండాలని, మంచి స్నేహితులను కలిగి ఉండాలని, ప్రతిపాఠశాలలో స్నేహిత ఫిర్యాదుల పెట్టెను ఏర్పాటు చేస్తామని విద్యార్థులు తమకు పాఠశాల సిబ్బంది నుంచి గానీ, బయట వ్యక్తుల నుంచి గానీ




ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా ఫిర్యాదు పెట్టెలో ఫిర్యాదు వేయాలని చెప్పారు.ఈ ఫిర్యాదు పెట్టెను షీటీం, బృందాలు పర్యవేక్షిస్తాయని అన్నారు. బాలికల భద్రతఅంటే కేవలం పోలీస్, ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని కుటుంబం, సమాజం విద్యావ్యవస్థ, సమానంగా బాధ్యత వహించాలని, ఎవరైనా బాలికలను వేధించిన,అసభ్యకరంగా ప్రవర్తించిన వెంటనే డయల్ 100 ఫిర్యాదు చేయాలని తక్షణమే పోలీసులు స్పందిస్తారని తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, మానసిక పరిస్థితిపై దృష్టి పెట్టాలని, పాఠశాలలలో భద్రతా వాతావరణం సృష్టించడం అందరి బాధ్యత అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిఅన్నారు.

## ఖానాపూర్ లో బోరు వేయించిన మంత్రి శ్రీధర్ బాబు

### -మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన గ్రామ ప్రజలు

**మంథని,డిసెంబర్,12 :** మంథని మండలం ఖానాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సహకారంతో ప్రజల సౌకర్యార్థం బోరు బావి ని యంత్రం ద్వారా వేయించారు. ప్రజల నీటి కష్టాలు తీర్చడానికి బోర్ వేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మాజీ సర్పంచ్ లు దొరగొర్ల శ్రీనివాస్ యాదవ్, సేమంతుల ఓదెలు గ్రామ యువకులు పాల్గొన్నారు.

# విద్యార్థి సంద్రంగా డిస్ట్రిక్ట్ సైన్స్ ఎగ్జిబిషన్



**బోధన్,డిసెంబర్,12 :** శాస్త్ర,సాంకేతిక అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు, విజ్ఞానశా స్త్రాల ప్రాధాన్యత పై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడం లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో బోధన్‌లోని విజయ మేరి హై స్కూల్‌లో నిర్వహిస్తున్న జిల్లా బాల వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థి సంద్రంగా మారిపోయింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు తమ క్రియేటివిటీ, ప్రతిభను ఆవిష్కరించే వేదికగా ఉపయోగించుకున్నారు. సైన్స్, మాథ్స్, పర్యావరణం, వ్యవసాయం, టెక్నాలజీ, ఇన్నోవేషన్ వంటి విభాగాల్లో సుమారు 550కి పైగా మోడళ్లు, ప్రాజెక్టులు ప్రదర్శించబడ్డాయి. విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ ఇరిగేషన్ సిస్టమ్‌లు, రోబోటిక్ మోడల్స్,ప్లాస్టిక్ రీసైక్లింగ్ టెక్నిక్స్, ఎనర్జీ కన్జర్వేషన్ ప్రాజెక్టలతో పాటు అవార్డు పొందిన ప్రాజెక్టులు సరికొత్త ఆలోచనలతో ఆకట్టుకున్నాయి. ప్రాజెక్టలను చూసేందుకు వచ్చిన వేలాది విద్యార్థులతో సైన్స్ ఎగ్జిబిషన్, స్కూల్ ఆవరణ మొత్తం విద్యార్థులు, ఉపాధ్యాయులు, సందర్శకులతో కిక్కిరిసిపోయింది. మోడళ్లను ఎలా రూపొందించారో, వాటి వెనుకున్న సైన్స్‌ను ఏకగళంగా వివరించిన విద్యార్థులు ఇతరులకు ప్రేరణగా నిలిచారు. ఈ సందర్భంగా సందర్శనకు వచ్చిన విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత అధికారులు ఏర్పాట్లు చేశారు. శానిటేషన్, తాగునీటి సౌకర్యం, భద్రత వంటి అంశాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక బృందాలను నియమించారు. భవిష్యత్తు శాస్త్రవేత్తలు, పరిశోధకులను తయారుచేసే ఇలాంటి వేదికలు విద్యార్థుల కెరీర్ నిర్మాణానికి బాటలు వేస్తాయని ఉపాధ్యాయులు తెలిపారు.

# ఈ విటమిన్లను రోజూ తీసుకోవాల్సిన అవసరం లేదు..

## వారంలో రెండు సార్లు చాలు..




మనల్ని ఆరోగ్యంగా ఉంచడంలో పోషకాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. పోషకాల్లో అనేక రకాలు ఉంటాయి. వాటిల్లో విటమిన్లు కూడా ఒకటి. విటమిన్లు ఎ, బి కాంప్లెక్స్, సి, డి, ఇ, కె ఇలా అనేక రకాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే రోజూ అన్ని రకాల విటమిన్లను మనం శరీరానికి అందేలా చూసుకోవాలి. అయితే విటమిన్లలో రెండు రకాలు ఉంటాయి. కొన్ని నీటిలో కరుగుతాయి.


కొన్ని కొవ్వుల్లో కరుగుతాయి. నీటిలో కరిగే విటమిన్లను మన శరీరం నిల్వ ఉంచుకోదు. అధికంగా ఉంటే బయటకు పంపిస్తుంది. కనుక ఇలాంటి విటమిన్లను మనం రోజూ తీసుకోవాలి. అదే కొవ్వులో కరిగే విటమిన్లను అయితే శరీరం నిల్వ ఉంచుకుంటుంది. కనుక ఈ విటమిన్లను రోజూ తీసుకోవాల్సిన అవసరం లేదు. విటమిన్లు బి, సిలు నీటిలో కరుగుతాయి. కనుక వీటిని రోజూ తీసుకోవాలి. విటమిన్లు ఎ, డి, ఇ, కె లు కొవ్వులో కరుగుతాయి. కనుక వీటిని వారంలో 2 లేదా 3 సార్లు తీసుకుంటే సరిపోతుంది.

**ఇవి కొవ్వులో కరుగుతాయి..:** విటమిన్లు ఎ, డి, ఇ, కె లు కొవ్వులో కరుగుతాయి. మనం తినే ఆహారాల్లో ఉండేఈ విటమిన్లు మన శరీరంలో నిల్వ ఉండే కొవ్వులో కరుగుతాయి. అప్పుడు మన శరీరంలోని కొవ్వు వినియోగం అవుతుంది. అనంతరం ఆ విటమిన్లను శరీరం శోషించుకుని నిల్వ చేస్తుంది. దీంతో విటమిన్లు ఎ,డి,ఇ, కెలు మనకు లభిస్తాయి. వీటిని శరీరం శోషించుకున్న తరువాత లివర్ లేదా కొవ్వు కణజాలంలో నిల్వ ఉంచుతుంది. అవసరం అయినప్పుడు ఉపయోగించుకుంటుంది. కనుక విటమిన్లు ఎ, డి, ఇ, కె లను వారంలో రెండు సార్లు లభించేలా చూసుకుంటే సరిపోతుంది. కొవ్వులో కరిగే ఈ విటమిన్ల వల్ల మనకు అనేక లాభాలు కలుగుతాయి. విటమిన్ ఎ కంటిచూపును మెరుగు పరుస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. చర్మాన్ని సంరక్షిస్తుంది. గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

**అనేక ఉపయోగాలు..:** విటమిన్ డి వల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతోపాటు ఎముకలు దృఢంగా మారి ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే విటమిన్ ఇ చర్మాన్ని రక్షిస్తుంది. రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. విటమిన్ ఇ వల్ల పురుషల్లో నపుంసకత్వ సమస్య తగ్గుతుంది. శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. విటమిన్ కె వల్ల గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీని వల్ల తీవ్ర రక్త స్రావం జరగకుండా అడ్డుకోవచ్చు. అలాగే విటమిన్ కె ఎముకల నిర్మాణానికి, దృఢత్వానికి సహాయం చేస్తుంది. కనుక కొవ్వులో కరిగే ఈ విటమిన్లను మనం వారంలో రెండు సార్లు లభించేలా చూసుకుంటే సరిపోతుంది. ఇక ఈ విటమిన్లు కొవ్వులో కరుగుతాయి కనుక మన శరీరంలో కొవ్వు కూడా ఉండాల్సిందే. కొందరు అసలు కొవ్వు ఉండొద్దని భావిస్తారు. కానీ అది సరికాదు. ఎందుకంటే ఆయా విటమిన్లు కరిగేందుకు, పలు రకాల జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు కొవ్వు అవసరం అవుతుంది. కనుక శరీరంలో పరిమిత మోతాదులో కొవ్వు తప్పనిసరిగా ఉండాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**ఈ ఆహారాలను తినాలి..:** విటమిన్లు ఎ, డి, ఇ, కెలను పొందడం కోసం మనం భిన్న రకాల ఆహారాలను తినాల్సి ఉంటుంది. బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా సీడ్స్, అవిసె గింజలు, చేపలు, పాలు, కోడిగుడ్లు, చికెన్, మటన్, రొయ్యలు, పాలకూర, గుమ్మడికాయలు, యాపిల్స్, క్యారెట్లు, చీజ్, టమాటాలు, వెన్న, నెయ్యి, పుట్ట గొడుగులు, మటన్ లివర్, మొలకలు, సోయా బీన్స్ వంటి ఆహారాలను తరచూ తీసుకుంటుంటే ఆయా విటమిన్లు అన్నింటినీ పొందవచ్చు. అయితే రోజూ ఉదయం శరీరానికి సూర్య రశ్మి తగిలేలా కనీసం 20 నిమిషాల పాటు ఎండలో ఉంటే మనకు కావల్సినంత విటమిన్ డి లభిస్తుంది. దీని వల్ల చర్మం కింది పొరల్లో ఉండే కొవ్వులో విటమిన్ డి తయారవుతుంది. ఇలా ఆయా విటమిన్లను తరచూ పొందడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు.


# స్వల్పంగా తగ్గిన బంగారం,వెండి ధరలు



**న్యూఢిల్లీ,డిసెంబర్,12:** అమెరికా కరెన్సీ డాలర్ బలపడుతున్న నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా బంగారం ధరలు స్వల్పంగా దిగొచ్చాయి. భారత్‌లో కూడా బంగారం ధర చెప్పుకోదగ్గ స్థాయిలో తగ్గింది. పెళ్లిళ్ల సీజన్ కొనసాగుతున్నా కూడా రేట్స్‌లో కోత పడింది. దేశంలోఉదయం సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ. 1,25,120. నిన్నటి ధరతో పోలిస్తే రూ.463 మేర తగ్గింది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర కూడా నిన్నటితో పోలిస్తే రూ.650 మేర తగ్గి రూ.1,14,690కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా తగ్గుదల కనిపించింది. సోమవారం నాటి ధరతో పోలిస్తే ప్రస్తుతం వెండి రేటు రూ. వెయ్యి మేర తగ్గి రూ.1,62,900కు చేరింది. డాలర్ బలపడటంతో బంగారానికి డిమాండ్ కాస్త తగ్గిందని నిపుణులు చెబుతున్నారు. డాలర్ సూచీ ప్రస్తుతం 100 మార్కుకు పైనే కదలాడుతోంది. గత ఆరు నెలల్లో ఇదే అత్యధికం. దీంతో ఇన్వెస్టర్లకు కమోడిటీ మార్కెట్‌పై ఆసక్తి తగ్గింది. ఈ నేపథ్యంలో వచ్చే నెలలో జరగనున్న అమెరికా ఫెడరల్ రిజర్వ్ సమావేశాలపైనే అందరి దృష్టి నెలకొంది. ఈసారి అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధించే అవకాశం 70 శాతంగా ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇదే జరిగితే సురక్షిత పెట్టుబడి సాధనమైన పసిడికి మళ్లీ డిమాండ్ పెరిగి ధరలకు రెక్కలొచ్చే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పార్కిన్సన్స్ వ్యాధికి అసలు కారణమిదే..

- ఆస్ట్రేలియా పరిశోధనలో కీలక విషయాల వెల్లడి
- మెదడులోని రక్తనాళాల్లో మార్పులే వ్యాధి తీవ్రతకు కారణం
- ప్రోటీన్ల కంటే రక్తనాళాల పాత్రే ఎక్కువని గుర్తింపు
- ఈ ఆవిష్కరణతో కొత్త చికిత్సలకు మార్గం సుగమం



పార్కిన్సన్స్ వ్యాధిపై ఇప్పటివరకు ఉన్న అవగాహనను మార్చేసే కీలక ఆవిష్కరణను ఆస్ట్రేలియా పరిశోధకులు కనుగొన్నారు. ఈ వ్యాధి కారణంగా మెదడులోని రక్తనాళాల్లో తీవ్రమైన మార్పులు సంభవిస్తాయని, ఇదే వ్యాధి ముదరడానికి ప్రధాన కారణమని వారు తేల్చారు. ఈ పరిశోధన భవిష్యత్తులో పార్కిన్సన్స్‌కు కొత్త చికిత్సా మార్గాలను అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటివరకు పార్కిన్సన్స్‌కు మెదడులో ఆల్ఫా-సిన్యూక్లిన్ అనే ప్రోటీన్ పేరుకుపోవడమే కారణమని భావించేవారు. అయితే, ఆస్ట్రేలియాలోని న్యూరోసైన్స్ రీసెర్చ్ ఆస్ట్రేలియా సంస్థ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, ప్రోటీన్ల కంటే మెదడులోని రక్తనాళాల్లో చోటుచేసుకునే మార్పులే వ్యాధి తీవ్రతలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తేలింది. "సంప్రదాయకంగా పరిశోధకులు ప్రోటీన్లు, నరాల కణాల నష్టంపైనే దృష్టి పెట్టారు. కానీ, మేము మెదడులోని రక్తనాళాల వ్యవస్థపై దాని ప్రభావాన్ని చూపించగలిగాం" అని పరిశోధనలో కీలకపాత్ర పోషించిన డెర్యా డిక్ తెలిపారు. తమ అధ్యయనంలో మెదడులోని కొన్ని ప్రాంతాల్లో రక్తనాళాలు బలహీనపడటాన్ని, ముఖ్యంగా పనికిరాని రక్త కేశనాళికల అవశేషాలు (స్ట్రింగ్ వెస్సెల్స్) పెరగడాన్ని గుర్తించినట్లు డెర్యా వివరించారు. దీనివల్ల మెదడులో రక్త ప్రసరణ, బ్లడ్-బ్రెయిన్ బ్యారియర్ పనితీరులో కూడా మార్పులు వస్తున్నాయని కనుగొన్నారు.

# ఎస్సీల ఎదుగుదలకు అడ్డంకిగా క్రిమిలేయర్ !

**న్యూఢిల్లీ,డిసెంబర్,12:** ఎస్సీలలో క్రిమిలేయర్ విధానం అమలు చేయాలని ఇటీవల పదవీ విరమణ పొందేముందు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ చేసిన సూచన సమాజానికి ఓ హెచ్చరిక లాంటిది. రాజకీ య పార్టీలు దీనిపై చర్చించాలి. పార్లమెంట్ దీనిపై చర్చించాలి. ఎందుకంటే సామాజికంగా ఎస్సీలు అంతా అభ్యున్నతి చెందాలంటే ఇది అత్యావశ్యకం. అప్పుడే ఎస్సీలంతా ఉన్నతంగా ఎదుగుతారు. లేకుంటే రిజర్వేషన్లు ఎన్నేళ్లు పెట్టినా కొందరే తన్నుకుపోతారు. ఇది అమలు కాకపోవడం వల్ల కేవలం కొందరే రిజర్వేషన్ల లబ్దిని పొందుతున్నారు. దీంతో గత 75 ఏళ్లుగా కొందరే ఉద్యోగ, రాజకీ య లబ్ది పొందుతూ వస్తున్నారు. వారి కుటుంబాలే సమాజాంలో వెలుగొందుతున్నాయి. పదవీ విరమణ పొందిన జస్టిస్ గవాయ్ దీనిని గట్టిగా సూచించి ఉంటే బాగుండేది. కేంద్రం కూడా ఎందుకో ఈ విషయంలో పట్టించుకోవడం లేదు. నిజానికి రిజర్వేషన్లను కొంతకాలం వరకే అమలు చేయాలి. ఒక కుటుంబం రిజర్వేషన్ల పొందిన తరవాత వారు ఉన్నతస్థానం చేరుకున్నాక వారిని క్రిమిలే యర్‌గా గుర్తించి, వారిని దూరం పెట్టాలి. ఉద్యోగాల్లో అయినా రాజకీయాల్లో అయినా ఇది చేసితీరాలి. ఇది లేకపోవడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన వారు వారసత్వం గా రిజర్వేషన్ ఫలాలు పొందుతున్నారు. వెనకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూ ల్డ్ జాతులు, తెగలవారి మధ్యలో రాజ్యం ద్వారా ఈ రిజర్వేషన్ల విధానం సమానత్వం, ఏకరూప అభివృద్ధి సాధించ వలసి వుంది. ఇందుకు బదులుగా, రిజర్వేషన్లు పొందిన కొన్ని కులాలు, కుటుంబాలే మళ్లీ మళ్లీ పొందుతూ అసమానతలను, వెనకబడిన వారి మధ్య మరింత వెనకబడిన పరిస్థితులను సృష్టించాయి. రిజర్వేషన్ల అమలు విధానాల ప్రభావాలను సమీక్ష చెయ్యడంలో ఆయా ప్రభుత్వాలు అనుసరించిన అలక్ష్యం, అలసత్వాలు ఈ ఆంతరిక వ్యత్యాసాల పెరుగుదలకు ఉపకరించాయి. హోదాలు, జీతభత్యాలతో సహా, అన్ని రకాల సంపద అవకాశాలూ ప్రతి ఒక్కరికీ పంచాలని రాజ్యాంగం నిర్దేశిరచిన సంగతిని ఈ విద్యావంతులైన సంపన్నశ్రేణి మరువరాదు. సాంకేతిక అంశాలను, సమాజాన్ని గందరగోళంలోకి నెట్టే తప్పుడు వాదనలను, భయాలను, స్వార్థపూరిత దుష్ప్రచారాలను కొనసాగించవద్దు. ప్రతి కులానికీ, జాతికీ, తెగకూ రిజర్వేషన్లలో పంపిణీ న్యాయం జరగటానికి వీలుగా, ఉపవర్గీకరణ చేసి, హేతుబద్ధీకరించాలని నలభైఏళ్లపాటు దండోరా ఉద్యమం జరిగింది. వర్గీకరణ వ్యతిరేకవాదులు ఆటంకాలు కల్పించి, చివరకు ఓడిపోయారు. ఇలా జరక్కుండా, అత్యంత వెనకబడిన అణగారిన కుటుంబాలకు, సమూహాలకు ప్రాధాన్యతలతో కూడిన ప్రాతినిధ్య న్యాయం కల్పించడానికి ఇప్పుడు సంపన్న శ్రేణిలో చేరిన వారు ప్రగతిశీల దృక్పథంతో క్రీమీలేయర్ అమలును స్వాగతించాలి. అగ్రకులాల వారిని విమర్శిస్తున్న వారు ఈ క్రిమిలేయర్ గురించి మాట్లాడడం లేదు. ముఖ్యంగా దళితుల్లో చైతన్యం రావాలి. వారే రిజర్వేషన్ను క్రమబద్ధీకరించే విషయంలో పోరాడాలి. అప్పుడే అస్సు రిజర్వేషన్లు పొందని వారికి న్యాయం జరగగలదు. ఉదాహరణకు ఓకుటుంబం తరాలుగా రిజర్వేషన్లను అనుభవిస్తోంది. వారు ఉన్నత స్థానానికి ఎదిగారు. పారిశ్రామిక వేత్తులుగా రాణిస్తున్నారు. ఇలా అనేకులు ముందు ఉన్నారు. కేవలం వీరిని ఉదాహరణగా చూపడం తప్ప వీరిగురించి వేరే ఉద్దేశ్యంతో కాదు.

పన్న శ్రేణిఅంటే క్రీమీలేయర్ విధానం ఎస్సీలలో ప్రవేశపెట్టడం అత్యంతావశ్యకం. జస్టిస్ గవాయ్ చేసిన సూచన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ కావాలి. ఎస్సీల్లో ఉపకులాల రిజర్వేషన్ల కోసం ఉద్యమించిన ట్లుగానే క్రిమిలేయర్ కోసం కూడా దళితులే ఉద్యమించాలి. ఈ డిమాండ్ చాలాకాలంగా ఉంది. అయితే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్ల ద్వారా అత్యధికంగా లబ్దిపొందిన ఎస్సీలు దీనిని వ్యతిరేకిస్తు న్నారు. ఇది సరికాదు. ఎస్సీ వర్గీకరణ అనుకూల ఎస్సీ మేధావులు దీనిపై చర్చించాలి. ఈ సంపన్నశ్రేణి విధానం దగ్గరికి వచ్చేసరికి, ప్రగతి నిరోధకంగా వ్యవహరిం చడం సరికాదు. ఆధిపత్య కులాల వారి సంపదలకు ఏ విధమైన పరిమితులూ విధించనప్పుడు, తమకు మాత్రం ఈ సంపన్న శ్రేణి విధానం వర్తింపజేయాలని కోర్టులు, ప్రభుత్వాలు ఆలోచించడం అన్యాయం అని కొందరు వాదిస్తున్నారు. అయితే ఇక్కడ ఎస్సీలది సమస్య ఆర్థిక సమస్య కాదు, సామాజిక సమస్య. రాజ్యాంగం ప్రసాదించిన రిజర్వేషన్ ఫలాలు అందరికీ అందాల్సిన తరుణంలో కొందరే అనుభవించడం సరికాదు. ఎస్సీల్లో కొందరు మాత్రమే రిజర్వేషన్ల ఫలాలు పొంది ఆర్థికంగా బాగుపడినప్పటికీ, కులపరంగా మిగతా వారు వేదనకు గురవుతున్నారు. ఇదో రకంగా ఎస్సీల్లో దొరతనానికి పరాకష్టగా చూడాలి. ఎస్సీలో కొందరు పెద్ద దొరలు తయారవుతున్నారు. రిజర్వేషన్ల ఫలాలతో ఎదిగిన ఈ వర్గాల్లో చాలామంది అభివృద్ధి చెందిన ఇతర కులాలతో అంటకాగుతూ, తమ వర్గాలను విస్మరిస్తున్నారు. ఈ కారణంగా 90శాతం మిగతా ఎస్సీల్లో ఇప్పటికీ ఆధిపత్య కులాల సంపన్నులతో పోటీపడలేక పోతున్నారు. రిజర్వేషన్ల ద్వారా లబ్దిపొందిన వారే మళ్లీ మళ్లీ అవకాశాలు అందుకుంటూ తమ వారికి అడ్డుగా మారుతున్నారు. డబ్బు సంపాదనలో ముందున్న కొందరు తమ వర్గంలోని మిగతావారిని పైకి తీసుకుని రాలేకపోతున్నారు. సంపన్నశ్రేణిని గుర్తించి సరిచేయడం ద్వారానే ఈ సమస్యకు పరిష్కారం చూపగలం. అలాగే రిజర్వేషన్లు ఎల్లకాలం అనుభవించే హక్కునుంచి వీరిని దూరం చేయాల్సిందు.

## మృతుని కుటుంబానికి రు. 50 లక్షలు, ఉద్యోగం ఇవ్వాలి

**జయశంకర్ భూపాలపల్లి,,డిసెంబర్,12 :** జయశంకర్ భూపాలపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట పారిశుద్ధ్య కార్మికుల నిరసనకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రవి పటేల్ మాట్లా డుతూ, పారిశుద్ధ్య కార్మికుడు బొల్లి రాజయ్య పని సమయంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందారని, పని ఒత్తిడి కారణమని కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు అత్యంత గంభీరమని పేర్కొ న్నారు. మృతుని కుటుంబానికి రు.50 లక్షల ఎక్స్గ్రేషియా, కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన అధికారులను ఉద్యోగాల నుండి తొలగించడంతో పాటు, కలెక్టర్, ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్ బాధ్యత తీసుకొని కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. డిమాండ్లు నెరవేరనిచో పెద్ద ఎత్తున నిరసనలకు దిగుతామని హెచ్చరించారు. భూపాలపల్లి మున్సిపాలిటీ కార్మికులకు ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, ఇందిరమ్మ/డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, అలాగే సేఫ్టీ కిట్లు, శానిటైజింగ్ సామగ్రి, యూనిఫామ్‌లు సకాలంలో అందించాలని, వేతనాలు పెండింగ్ కాకుండా విడుదల చేయాలని రవి పటేల్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు అనంతుల సంపత్, ఇనుగాల ప్రణీత్, గట్టు శ్రీకాంత్ పాల్గొన్నారు.



# చీరతో పట్టేసే చేప పిల్లలకు భలే డిమాండ్!



**కాకినాడ,డిసెంబర్,12 :**గోదావరి జిల్లాలో పులసకు ఉన్న క్రేజ్ ఎంతో అందరికీ తె లిసిన విషయమే.. కానీ ఇంచుమించు ఈ సీజన్‌లో అంతే క్రేజ్ ఉన్న గోదావరి వంటకం చీరమేను..చీరతో వేటాడే ఈ చేపపిల్లల టేస్ట్ గు రించి మాంస ప్రియులు చాలా గొప్పగా చెబుతారు.. గోదావరిలో లభ్యమయ్యే ఈచీరమేను రేటు కూడా అంతేస్థాయిలో కూడా ఉంటుంది.. ఎందుకంటే ఇది అరుదుగా దొరికే సీజనల్ చీరమేను కావడం దీనికి ప్రధాన కారణం కూడా.. పూర్వ కాలంలో శేరు, తవ్వ, సోల కింద కొలిచి అమ్మే ఈ చీరమేను ఇప్పుడు కిలోల లెక్కన అమ్మకా లు సాగిస్తున్నారు.. ఒక కిలో చీరమేను రూ.3000 నుంచి రూ.4000 వరకు విక్రయాలు జరుగుతుండగా పావుకిలో చొప్పున కూడా అమ్మ కాలు చేస్తుంటారు స్థానికంగా ఉన్న మత్స్యకారులు.. తాజాగా చీరమేను సీజన్ కావడంతో పుదుచ్చేరీ యానం మార్కెట్‌లో చీరమేను ను కొనేం దుకు ఎగబడుతున్నారు నాన్ విజిటేరియన్స్...గోదావరిలో చీరమేను అరుదుగా దొరుకుతుంది కాబట్టే దీనికి ఇంత ధర పలుకుతుం దం టుంటారు చీరమేను గురించి తెలిసిన వారు.. గోదావరి ప్రవాహం ఓ వైపు, గోదావరిపై వీచే శీతల చల్లగాలులు మరోవైపు ఈ ప్రభావానికి దొందు జాతికి చెందిన చేపపిల్లలు సమూ హంగా నీటి ఉపరితలంపై నురగలాతేలుతూ కదులుతుంటాయి.. నీటిఅలల తాకిడికి నురగ కూడా తోడవ్వడంతో ఈసమూహాన్ని గుర్తించడం మత్స్యకారులకు చాలా తేలిక అవుతుంది.ఈ సమూహం కదలికను ముగ్గురు కలిసి చీరతో అడ్డుకుని పట్టుకుంటారు.. ఇది గట్టుపైకి తీసుకువచ్చి నీళ్లల్లో కడిగి బకెట్లలోఉ ంచుతారు.. వలకు చిక్కని చిన్న చేపపిల్లలు కావడం, సమూ హంగా కదలడంతో వలకు చిక్కవు గనుక ఈ చేపపిల్లలను చీరతో మాత్రమే పట్టుకునేందుకు వీలవుతుంది.. అందుకే వీటికి చీరమేను అనే పేరు వచ్చిందంటారు.. అయితే ఇప్పుడు సీడ్ నెట్ అందుబాటులో ఉండడం తో వీటితోనే చీరమేనును పట్టుకుంటున్నారు.గోదావరిలో అరుదుగాదొ రికే ఈ సీజనల్ చీరమేను కోసంమాంస ప్రియులు ఎందు కు అంతగా ఎగబడతారు అంటే వీటితో చేసిన వంటకాలు అంత రుచిగా ఉ ంటాయని చెబుతుంటారు.. చీరమేను చింతకాయ పులుసు, చీరమేను మసాలా కూర, చీరమేనుతో కలిపి వేసిన గారెలు అబ్బో ఆ టేస్టే వేరే లెవెల్ అంటుంటారు గోదావరి ప్రజలు.. ప్రస్తుతం చీరమేను యానాం చేపలమార్కెట్‌లో దొరుకుతోంది.. ధవళేశ్వరం, అంతర్వేది, ఓడలరేవు ఇలా చాలా ప్రాంతాల్లో ఈ చీరమేను లభ్యం అవుతోంది.. కొంతమంది కిలోల లెక్కన విక్రయాలు చేస్తుండగా కొంత మంది కొలతల ప్రకారం అంటే శేరు, తవ్వ,సోల ప్రకారం కొలిచి అమ్ముతు న్నారు.

# ఆ పది రాష్ట్రాలకే సంపన్నులు పరిమితం..

## - అక్కడే అభివృద్ధి కేంద్రీకృతం
## - మిగిలిన భారతావనిలో అన్నీ సమస్యలే
## - దేశంలో పెరిగిపోతున్న అంతరాలు




**న్యూఢిల్లీ,డిసెంబర్,12 :**దేశంలో 1,687 మందికి వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపద ఉంది. అలాగే 358 మంది వద్ద ఎనిమిదిన్నర వేల కోట్ల సంపద పోగుపడి ఉంది. వీరందరి వద్ద కలిపి ఉన్న సంపద భారత జీడీపీలో దాదాపు సగానికి సమానమని హూరన్ ఇండియా రిచ్ తాజా జాబితా తెలిపింది. ఈ గణాంకాలు దేశానికి గర్వకారణమ ని అనిపిస్తోంది కదూ ! కానీ నాణేనికి మరో వైపు కూడా చూస్తే చేదునిజాలు బయటపడతాయి. కనిపిస్తున్న సుందర దృశ్యం అదృశ్య మవుతుంది. ఈ సంపద అంతా దాదాపుగా దేశంలోని కొన్ని ప్రాంతా లలోనే కన్పిస్తుంది. భారతదేశానికి చెందిన మిలియనీర్ కుటుంబాల లో సగానికి పైగా కుటుంబాలు మహారాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, కర్నాటక, గుజరాత్‌లోనే ఉండడం గమనార్హం. తెలంగాణ, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా.. వీటిని కూడా కలుపుకుం టే భారత వృద్ధిలో 90శాతం ఈ పది రాష్ట్రాలలోనే మనకు కన్పిస్తుంది. మరో మాటలో చెప్పాలంటే ముంబయి, ఢిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, అహ్మదాబాద్ నగరాలలోనే సంపద సృష్టి జరుగుతోంది. మిగిలిన ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉన్నాయి. హూరన్ నివేదికను పరిశీలిస్తే పరస్పర విరుద్ధమైన అంశాలు ఎన్నో కన్పిస్తాయి. అది కేవలం సంపన్నుల జాబితా మాత్రమే కాదు. దేశంలో అభివృద్ధి ఎక్కడ కేంద్రీకృతమైంది, అది ఇంకా ఎక్కడ కన్పించడం లేదు అనే అంశాలను కూడా ఆ నివేదిక స్పృశించింది.

కొన్ని రాష్ట్రాలలోనేఎందుకు కేంద్రీకృతం?: సంపద ఎక్కడఉంటే అక్కడ అవకాశాలు లభిస్తాయని చెబుతుంటారు. మహారాష్ట్రలో వాణిజ్య రాజధాని ముంబయి ఉంది. ఆ రాష్ట్రంలో వెయ్యి కోట్ల రూపాయలకు పైగా సంపద ఉన్న వారు 548 మంది. అంటే దేశంలో ఉన్న సంపన్ను ల్లో సగం మంది మహారాష్ట్రలోనే ఉ న్నారన్న మాట. ఢిల్లీలో 223 మంది సంపన్నులు ఉండగా కర్నాటక, గుజరాత్, తమిళనాడు, తెలం గాణలో మిగిలిన వారు నివసిస్తున్నారు. దీనిని బట్టి అర్థమవుతున్న విషయం ఏమిటంటే ఎక్కడ డబ్బు ఉంటే అక్కడ వ్యాపారం అభివృద్ధి చెందుతుంది. మౌలిక సదుపాయాలు ఉంటాయి. పెట్టుబడిదారులకు విశ్వాసం కలుగుతుంది. ముంబయి లేదా బెంగళూరులో వ్యాపారం ప్రారంభించాలని అనుకుంటే పెట్టుబడిని సమీకరించడం సులభం. నిపుణులైన సిబ్బంది లభిస్తారు. డబ్బు ఖర్చు చేసే వినియోగదదారులూ దొరుకుతారు. అదే ఇండోర్‌లోనో పాట్నాలోనూ వ్యాపారం చేస్తే అభివృద్ధి చెందడానికి చాలా కాలం పడుతుంది. ఏం తయారు చేస్తున్నామన్న దాని కంటే ఎక్కడ తయారు చేస్తున్నామన్నదే ముఖ్యమని ఓ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ యజమాని వ్యాఖ్యానించారు.

# గృహ రుణాల్లో ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు భళా..!

## -50 శాతానికి పెరిగిన మార్కెట్ వాటా
## -క్రిప్ హై మార్క్ రిపోర్ట్



న్యూఢిల్లీ : గృహ రుణాల్లో ప్రయివేటు రంగ బ్యాంక్‌లు అధిక వడ్డీ రేట్లను వసూలు చేయడంతో రుణగ్రహీతలు ప్రభుత్వ రంగ బ్యాంక్‌ల వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. దీంతో ఈ విభాగం రుణాల మార్కెట్‌ల్లో ప్రభుత్వ రంగ బ్యాంక్ (పిఎస్‌బి)ల మార్కెట్ వాటా 50 శాతానికి చేరిందని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. ఇటీవల ఆర్‌బిఐ వరుసగా తగ్గించిన వడ్డీ రేట్లను ఖాతాదారులకు బదిలీ చేయడంలో ప్రయివేటు విత్త సంస్థలు సరిగ్గా స్పందించకపోవడంతో రుణగ్రహీతలు పిఎస్‌బిలను ఆశ్రయించి ఉండొచ్చని తెలుస్తోంది. తీవ్ర పోటీ కలిగిన ఈ రుణ మార్కెట్‌లో ప్రయివేటు రంగ బ్యాంక్‌లను ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు అధిగమించాయని క్రెడిట్ బ్యూరో సంస్థ క్రిఫ్ హై మార్క్ సోమవారం ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. సెప్టెంబర్ నాటికి కొత్తగా జారీ చేయబడిన మొత్తం గృహ రుణాల విలువలో పిఎస్‌బిల వాటా 50 శాతానికి చేరుకుందని తెలిపింది. ఆ రిపోర్ట్ వివరాలు.. గృహ రుణాల జారీలో ప్రయివేటు రంగ బ్యాంకులను పిఎస్‌బిలు అధిగమించి మార్కెట్ లీడర్‌షిప్‌ను సాధించాయి. మొత్తం గృహ రుణాల మార్కెట్ సెప్టెంబర్ చివరి నాటికి రూ. 42.1 లక్షల కోట్లకు చేరుకుంది. ఏడాదికేడాదితో పోల్చితే 11.1 శాతం పెరుగుదల నమోదయ్యింది. మొత్తం యాక్టివ్ రుణాల సంఖ్య స్వల్పంగా పెరగడంతో పాటుగా సగటు రుణ మొత్తం పెరిగింది. దాదాపు 40 శాతం గృహ రుణాలు రూ.75 లక్షల కంటే ఎక్కువ విలువ కలిగినవిగా ఉండటం విశేషం. మొత్తం వినియోగ రుణాల విభాగం 15.3 శాతం పెరిగి రూ.109.6 లక్షల కోట్లకు చేరుకుందని క్రిఫ్ హై మార్క్ తెలిపింది. "ఈ విభాగంలో బంగారంపై రుణాలు వేగవంతమైన వృద్ధిని సాధించాయి. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు విలువ, సంఖ్యలోనూ తమ మార్కెట్ అధిపత్యాన్ని పెంచుకున్నాయి. భౌగోళికంగా జనాభా విభాగాలలో మరింత బాధ్యతాయుతంగా విస్తృత ఆధారిత ఆర్థిక సాధికారతను ప్రోత్సహించాయి." అని క్రిఫ్ హై మార్క్ ఛైర్మన్ సచిన్ సేథ్ పేర్కొన్నారు. గడిచిన సెప్టెంబర్ ముగింపు నాటికి కన్స్యూమర్ డ్యూరెబుల్స్ రంగం రుణాల జారీలు మందగించి.. 10.2 శాతం పెరుగుదలతో సరిపెట్టుకున్నాయని ఆ సంస్థ పేర్కొంది.


# "హ్యాండ్" ఇస్తారా అండగా నిలబడతారా..?

**హైదరాబాద్,డిసెంబర్,12 :**తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై జనాభి ప్రాయం తెలిపే ఎన్నికలు త్వరలో జరగనున్నాయి. గ్రామీణ, ప ట్టణ ప్రాంతాల్లో పార్టీ పరిస్థితి, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారన్న దానిపైనే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పబోతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇప్పటికే రెండేళ్లు దాటి పోయింది. ఈ రెండేళ్లలో ఒకే ఒక ఉప ఎన్నిక జరిగింది. కంటోన్మెంట్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎ న్నికల్లో విజయం సాధించినప్పటికీ అది అధికారంలో ఉన్న పార్టీపై ప్రజలు మొగ్గు చూపారని అనుకోవాలి. కానీ నేడు అలా కాదు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్నాయి. పల్లెలు, పట్టణాలలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకో నున్నారు. అయితే ఈ ఎన్నికలు కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మక మని చెప్పాలి. ఎందుకంటే ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంతో పాటు ఇచ్చిన హామీలను ఏ మేరకు అమలు జరిపారన్న దానిపైనే ఈ ఎన్నికల్లో ప్రజలు ఓట్లు వేసే అవకాశము ంది. ప్రధానంగా రైతులు యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు భరోసా పథకాన్నిఅమలు చేసినప్పటికీ యూరియా కొరత కొంత రైతుల్లో అసంతృప్తి ఉంది. మరొకవైపు ఉద్యోగ నోటిఫికేషన్లు కూడా ఈ ప్రభుత్వంలో బాగానే విడుదలయ్యాయి. అయినా నిరుద్యోగ యువ తలో ఎంత మేరకు అసంతృప్తి ఉందన్నది ఈ ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టమవుతుందిఇక ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ కార్డులను పంపిణీ చేసింది. ఇది తమకు పాజిటివ్ గా ఓటింగ్ ఉ ంటుందని కాంగ్రెస్ నేతలు అంచనా వేసుకుంటున్నారు. మరొకవైపు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కూడా ఒకరకంగా తమకు అనుకూల ంగా మారతాయని భావిస్తున్నారు. అయితే ఇచ్చిన హామీలు ఎంతమందికి అమలయ్యాయి ఎంత మంది లబ్ది పొందారు గత ప్రభుత్వం లో లబ్ది పొందిన వారితో పాటు ఈ ప్రభుత్వంలో మరికొంత మంది ప్రయోజనం పొందారా లేక కోత విధించారా అనేది ఫలితాలను బట్టి వెల్లడవుతుంది. గత ప్రభుత్వంలో కల్యాణ లక్ష్మి పథకం అమలయ్యేది. ఇలా కొన్ని హామీలను అమలు చేయకుండానే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు వెళుతుంది. మరి ప్రజలు హ్యాండ్ ఇస్తారా కాంగ్రెస్ కు అండగా నిలబడతారా అన్నదిఎన్నికల ఫలితాల మాత్రమే తెలియనుంది.రాష్ట్రంలోని 5,7 49 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే 12,733 పంచయతీలకు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరగ నున్నాయి.తెలంగాణలో నేటి నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. తెలంగాణలోని 31 జిల్లాల్లోని 565 మండలాల్లో ఎన్ని కలు జరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు 1.12 లక్షల పోలింగ్ స్టేషన్లను గుర్తించా రు. తొలుత ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నా యి. ఎంపీటీసీ, జడ్పీటీసీ తొలి విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 27న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల రెండో విడత పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 31 న తొలి విడత పోలింగ్ జరగనుంది. పంచాయతీలకు రెండో విడత పోలింగ్ నవంబరు నాలుగో తేదీన, మూడో విడత నవంబరు 8వ తేదీన నిర్వహించనున్నా రు. పోలింత్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు జరుగుతుంది. నవంబరు 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ జరగనుంది.

# ఎమ్మెల్యే సోదరుడి ఆస్తులు అటాచ్ మెంట్..!

**హైదరాబాద్,డిసెంబర్,12 :** అక్రమ మైనింగ్, మనీలాండరింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సోదరుడుగూడెం మధుసూదన్‌రెడ్డి యజమానిగా ఉ న్న సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లై సంస్థకు చెందిన సుమారు రూ. 80.05 కోట్ల విలువైన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) హైదరాబాద్ విభాగం జప్తు చేసింది. ఈ మేరకు ఈడీ కార్యాల యం అధికారిక ప్రకటన విడుదల చేసింది. సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లై సంస్థ తమకు కేటాయించిన క్వారీ పరిమితికి మించి తవ్వకాలు జరపడంతో పాటు, ప్రభుత్వానికి సంబంధించిన ఇతర భూముల్లోనూ అక్రమ మైనింగ్‌కు పాల్పడింది.దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు భారీగా నష్టం వాటిల్లిందని అధికారులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల ఆధారం గా పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో గూడెం మధుసూదన్‌రెడ్డిపై గతంలో కేసు నమోదైంది. పోలీసుల దర్యాప్తులో తేలిన వివరాల ప్రకారం.. ఈ అక్రమ మైనింగ్ వల్ల రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి రూ. 39.08 కోట్ల నష్టం వాటిల్లింది. అయితే నిందితులు ఈ అక్రమ కార్యకలాపాల ద్వారా సుమారు రూ. 300 కోట్లు లబ్ధి పొందారని వెల్లడైంది. పోలీసుల దర్యాప్తు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం (ఖఓంం) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో గతంలోనే సోదాలు నిర్వహించి, కీలక ఆస్తి పత్రాలను స్వాధీనం చేసుకుంది. సంతోష్ శాండ్ అండ్ గ్రానైట్ సప్లై సంస్థకు కేటాయించిన మైనింగ్ లైసెన్సును మధుసూదన్‌రెడ్డి, జి. విక్రమ్‌రెడ్డి భాగస్వాములుగా ఉన్న జీవీఆర్ ఎంటర్‌ప్రైజెస్‌కు సబ్-కాంట్రాక్టుకు ఇచ్చారు.ఈ విధంగా లైసెన్సును బదిలీ చేయడం నిబంధనల ప్రకారం చెల్లదని ఈడీ పేర్కొంది. మైనింగ్ ఉత్పత్తుల అమ్మకాలు చాలావరకు నగదు రూపంలోనే జరిగా యని, తద్వారా అక్రమ ఆదాయాన్ని దాచిపెట్టినట్లు ఈడీ వెల్లడించింది. అక్రమ మైనింగ్ ద్వారా ఆర్జించిన సొమ్మును ఉపయోగించి మధుసూదన్ రెడ్డి బినామీల పేర్ల మీద పెద్ద మొత్తంలో ఆస్తులను కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేరకు ఈడీ మొత్తం రూ. 80.05 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది.

# శిథిలావస్థకు నిజాంసాగర్..?



**నిజామాబాద,డిసెంబర్,12:** కామారెడ్డి జిల్లాలోని అతి పురాతనమైన నిజాంసాగర్ ప్రాజెక్టు భద్రతపై నీలి మేఘాలు కమ్ముకుంటున్నాయి. 100 సంవత్సరాల క్రితం నిజాం కాలంలో నిర్మించిన నిజాంసాగర్ ప్రాజెక్టు కు సరియైన మరమ్మత్తులు లేని కారణంగా శిథిలావస్థకు చేరే పరిస్థితి దాపురించింది. ప్రాజెక్టుపై గుంతలు పడిన అధికారులు పట్టించుకోవడం లేదు. భారీ వర్షాలు కురవడంతో పాటు భారీ వరద ప్రాజెక్టు లోకి వచ్చి చేరుతుండడంతో చిన్న చిన్న గుంతలు పెద్ద గుంతలుగా మారి ప్రాజెక్టు కట్ట పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నూతన ప్రాజెక్టులనిర్మాణంపై ఉన్న శ్రద్ధ నిజాం కాలంలో నిర్మించిన 100 సంవత్సరాలు పూర్తయిన నిజాంసాగర్ ప్రాజెక్టును కాపాడుకోవ డంలోఅధికారులు, పాలకులకు భద్రతపై చిత్తశుద్ధి లేదనేది జగమె రిగిన సత్యం.గత నెల రోజుల నుండి నిజాంసాగర్ ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తుండడంతో తరచూ వరద గేట్లు మోరాయిస్తున్నా యి. దానికి తోడు ప్రాజెక్టు కట్టపై ఉన్న రిటైనింగ్ వాల్ పక్కన రోడ్డుపై మోకాళ్ళోదు గుంతలు ఏర్పడడంతో ప్రాజెక్ట్ భద్రతపైప్రజలుఆందోళన వ్యక్తం చేస్తున్నారు.మోకాలులోది గుంత లోవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న సంబంధిత అధికారుల కు పట్టనట్లు కనిపిస్తోంది. పురాతన ప్రాజెక్టుపై చిన్నపాటి గుంతలు ఏర్పడ్డ ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సిన అవసరంఉన్న ఇవేమీ తమకు పట్టనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు.

# మధురవనం దోపిడీ..!

**నల్గొండ,తెలంగాణ దిశ :** అది కొండమల్లేపల్లిలోని మండలంలోని కోల్‌ముం తల్‌పహాడ్ గ్రామం. పైగా హైదరాబాద్- నాగార్జునసాగర్ హైవే. ఇంకేముందీ పచ్చని భూముల్ని వెంచర్లుగా మార్చేసి.. రంగురం గుల బ్రోచర్లతో కస్టమర్లను బురిడీ కొట్టించి.. ఆఫర్ల పేరుతో ప్లాట్లను అంటగడుతున్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో విజన్ ఇన్‌ఫ్రా డవలపర్స్ భారీ ఫామ్ లాండ్ దందాకు తెరలేపింది.మధురవనం పేరుతో ఏకంగా 243 ఫామ్ ల్యాండ్ ప్లాట్లను వెంచర్‌గా చేసి విక్రయాలను మొదలు పెట్టింది. అయితే సదరు వెంచర్ ఏర్పాటుకు కనీస అనుమతులు లేకపోవడం గమనార్హం. అయితే ఈ ఫామ్ ల్యాండ్ అక్రమ దందాకు రెవెన్యూ యంత్రాంగం వంతపాడుతుండడం కొసమెరుపు. వ్యవసాయ భూమిని గుంటల్లో రిజిస్ట్రేషన్ చేసేందుకు కొండమల్లేప ల్లి తహసీ ల్దార్ కార్యాలయం వేదిక అయ్యింది.

ఇంత జరుగుతున్నా జిల్లా రెవెన్యూ యంత్రాంగం మొద్దు నిద్రను వీడడం లేదు.కొండమ ల్లేపల్లి మండలంలోని కోల్‌ముంతల్‌పహాడ్ రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వేనంబర్లు 89,90,92,93ల్లో విజన్ ఇన్‌ఫ్రా డవల పర్స్‌ఆధ్వర్యంలో మధురవనం పేరుఫ్యామ్ ల్యాండ్ వెంచర్ ఏర్పాట య్యింది. ఈ వెంచర్‌లో ఒక గుంట దగ్గరి నుంచి మొదలు పెడితే.. ఐదారుగుంటల వరకు గుట్టుచప్పుడు కాకుండా రిజిస్ట్రేషన్లు జరుగు తున్నాయి. నిజానికి డీటీసీపీ, రేరా వంటి అనుమతులేవి లేకుండానే ఫామ్‌ల్యాండ్ ప్లాట్ల విక్రయాలు జోరందుకున్నాయి.అయితే సదరు వెంచర్ యాజమాన్యం ఇందులో కొత్త తరహా దందాకు తెరలేపింది. రిజిస్ట్రేషన్లు గుంటల్లో చేస్తున్నప్ప టికీ.. అమ్మకాలు మాత్రం గజాల లెక్కన డబ్బులు దండుకుంటుం డడం గమనార్హం. అయితే ప్రతి ఆదివారం స్పెషల్ ఆఫర్ పేరుతో కస్టమర్లను వెంచర్ వద్దకు తీసుకొచ్చి నాన్‌వెజ్ భోజనం.. రంగురం గుల బ్రోచర్లతో బురిడీ కొట్టించి ప్లాట్లను అంటగట్టేస్తున్నారు.పైగా హైదరాబాద్- నాగార్జున సాగర్‌హైవే కావడంతో హైదరాబాద్ మహానగరంతో పాటు మహ బూబ్‌నగర్, నల్లగొండ జిల్లా కేంద్రాల నుంచి సైతం కస్టమర్లను కార్లలో తరలించి ప్లాట్లు కొనుగోలు చేసేలా మాయమాటలు చెబుతుండడం కొసమెరుపు.హైదరాబాద్- నాగార్జునసాగర్ హైవేదే భవిష్యత్ అంతా.. ఫ్యూచర్‌లో ఇక్కడ సైతం ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ వంటివి రాబోతున్నాయి. హైదరాబాద్ చుట్టూ పక్కలా భూమి అయిపోయింది.

Edited,Printed,Published and Owned by PALLA KONDALA RAO, H.No:5-13/1,Allapadu Road,Bonakal(Village,Post & Mandal),Khammam District-507204, Telangana State.
Printed at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah nagar, Gurralapadu (V), Tallampadu (Post), Khammam(Rural) Mandal, Khammam District, Pin-507170, Telangana State.
Published at H.No:11-3-17/1, Beside Ankura Hospital,Balaji Nagar, Khammam-507002, Telangana State, EDITOR : PALLA KONDALA RAO RNI. No. TELTEL/2017/74161